జనరాజకీయం కోసం

# లోక్‌సత్తా టైమ్స్

పక్ష పత్రిక

సంపుటి - 1 సంచిక - 2 జనవరి - 16-31, 2010 రూ॥ 10/-




## రాష్ట్ర సంక్షోభానికి రాజ్యాంగ పరిష్కారం...



జనవరి 23 జయంతి

మీ రక్తాన్ని నాకివ్వండి
నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను

నేతాజీ సుభాష్ చంద్రబోస్
(1897 -        )



జనవరి 28 జయంతి

నాపై గురిపెట్టబడిన ప్రతి లాఠీదెబ్బ
బ్రిటీష్ సామ్రాజ్యవాద శవపేటికకై
కొట్టబడిన మేకు అవుతుంది

పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్
(1865- 1928)



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డా॥ జెపి



కేశవరం గ్రామంలో వరద ముంపుకు గురైన పైరును పరిశీలిస్తున్న డా॥ జెపి



కేశవరం గ్రామ సందర్శనలో డా॥ జెపి



కేశవరం గ్రామంలో దుప్పట్ల పంపిణీలో డా॥ జెపి




నేషనల్ యూత్ డే సందర్భంగా రాష్ట్రంలో శాంతిస్థాపనకై యువసత్తా ప్రతిజ్ఞ



అవినీతికి వ్యతిరేకంగా సంతకాల సేకరణలో యువసత్తా

## నిర్భయంగా వుండండి



దేనికి భయపడవద్దు
మీరు అద్భుతమైన పనులను చేయబోతున్నారు.
భయపడిన మరుక్షణం
మీరు ఎందుకూ పనికిరారు.
ఈ ప్రపంచంలోని ఘోరమైన బాధలన్నింటికీ
అసలు కారణం భయమే.
భయమే మన దుఃఖాలన్నిటికీ ఏకైక కారణం.
నిర్భయత్వం క్షణంలో మనకు స్వర్గాన్ని కొనితేగలదు.
కాబట్టి లేవండి! మేల్కొండి! గమ్యాన్ని
చేరుకునేవరకూ ఆగకండి

– స్వామి వివేకానంద
జనవరి 12 జయంతి

## లోపలి పేజీల్లో...


1. రాజ్యాంగానికి 60 ఏళ్ళు ................................ 5
2. పోటాపోటీ విధ్వంస రాజకీయం పోవాలి........... 8
3. నాయకులతో ప్రజలను ప్రభావితం.................... 9
4. పౌరకేంద్ర సిద్ధాంతం........................................ 11
5. యువత యువశక్తి కలిస్తే................................ 13
6. నాణ్యమైన విద్య కోసం................................... 14
7. ప్రజలే ప్రభువులు - పాలకులు సేవకులే.......... 15
8. ఆర్టీసి ఛార్జీల పెంపు......................................... 16
9. ప్రజాస్వామ్యం అంటే........................................ 17
10. మీడియా నియంత్రణ.......................................... 18
11. నాయకత్వం అంటే............................................ 19
12. పార్టీ జెండా చిహ్నం.......................................... 19
13. ప్రక్షాళన ........................................................ 20
14. పార్టీ సర్క్యులర్స్ ............................................ 21
15. సిటిజన్స్ ఛార్టర్లు.............................................. 22
16. రిజర్వేషన్లపై లోక్‌సత్తా విధానం........................ 23
17. న్యూస్ డైజెస్ట్.................................................. 26
18. జిల్లాల సమాచారం............................................ 28
19. యువసత్తా ...................................................... 29
20. మీడియా ప్రాధమ్యాలు...................................... 30


# సమిధలు..........?

సంపాదకీయం

గ్రామీణ ప్రాంతాల నుండి ఎన్.ఆర్.ఐ. ల వరకు ఆంధ్రప్రదేశ్ నలు చెరగుల ఉద్యమాల చెరబడని ప్రాంతం లేదు. ఇన్నాళ్ళూ దోచుకున్నవాళ్ళే, దోచుకోవడంలో పొరపొచ్చాల వల్ల, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి వేడుకగా బలాబలాల పరీక్ష చేసుకుంటున్నారు.

ఉద్వేగాలు చల్లారి, ఉద్యమాలు అటకెక్కిన తరువాత వచ్చే పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ సమైక్యంగా వున్నా లేక విభిన్న ప్రాంతాలుగా విడివడినా, అలసి సొలసి పరిగెత్తే ఓపికలేక నీరసించిన పందెపు కోళ్ళుగా మిగిలేది సామాన్య ప్రజానీకమే, తోడేళ్ళై వారిని పీక్కుతినేందుకు మరింత బలోపేతమయ్యేది సంప్రదాయ రాజకీయ నాయకులే.

54 ఏళ్ళుగా ప్రత్యేక, సమైక్య వాదాల చలికాగుతూ అవసరమైనప్పుడల్లా విద్యార్థులనే చితుకులను ఎగదోసి రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తూ ఇరు ప్రాంతాల ప్రజలను మోసగిస్తూ రాక్షస క్రీడలో పరిణతి చెందారు కేంద్ర, రాష్ట్ర రాజకీయ నాయకులు.

తెలంగాణా గోసలో, ఆంధ్ర అగచాట్లలో మునిగితేలుతున్న మేధావులు రాజకీయ నాయకుల అంటతెడ్లై, వారికి విద్యార్థులకు మధ్య అనుసంధానకర్తలుగా మారి, దిశానిర్దేశంలో గమ్యం కోల్పోయి, ఒక్కోసారి నిరాశతో, మరోసారి ఆవేదన ఆక్రోశాలతో, బేలగా రాజకీయ ఉద్యమాల హోరులో కొట్టుకు పోతున్నారు.

సమగ్ర భారత ధరిత్రి గర్భాన రేగుతున్న చిచ్చును ఆర్పగలిగిన మేధావులు, విద్యార్థులు, శాశ్వత పరిష్కారం లభించనీయని స్వార్థపరుల చేతిలో ఆయుధాలుగా మారిన వేళ ఆయా ఉద్యమాలు రగిల్చే బడబాగ్నిలో సామాన్య ప్రజానీకం కాక మరింకెవ్వరు సమిధలు?

**ఓ మంచి ఆలోచన లక్షల మందిని కదిలిస్తుంది**
**లక్షలాది మంది కదలిక సమాజాన్ని సమూలంగా మారుస్తుంది**

**లోక్‌సత్తా టైమ్స్** - కొత్త రాజకీయ పక్షపత్రిక

**జనవరి 16-31, 2010** **సంపుటి - 1** **సంచిక - 2**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

ముద్రణ : కళాజ్యోతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్

ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తరపున,
ప్లాట్ నం. బి 504, పాషాకోర్ట్స్, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**

# మన రాజ్యాంగం

## ప్రస్తావన *Preamble*

భారతదేశ ప్రజలమగు మేము, భారతదేశమును సార్వభౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యముగా నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరుకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయమును, భావము భావప్రకటన, విశ్వాసము, ధర్మము, ఆరాధన... వీటి స్వాతంత్ర్యమును, అంతస్తులోను, అవకాశములోను సమానత్వమును, చేకూర్చుటకు;
మరియు వారందరిలో వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను, అఖండతను తప్పక ఒనగూర్చి సౌభ్రాతృత్వమును పెంపొందించుటకు;
సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,
ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ దినమున
మా సంవిధాన (రాజ్యాంగ) సభయందు ఇందుమూలముగ, ఈ సంవిధానమును (రాజ్యాంగమును) అంగీకరించి, అధిశాసనము, చేసి మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.

**మీరూ రాయండి :** లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.

**ఒక రాజకీయ పార్టీ దిక్సూచి లాగా వ్యవహరించాలి తప్ప గాలిమర లాగా పనిచేయరాదు.**

## సమాచారం పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన సమాచారాన్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు. లోక్‌సత్తా పార్టీ స్థానిక కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని (వీలైతే ఫొటోలతో పాటు) ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా పంపించండి. ప్రచురణార్హమైన రచనల్ని వీలువెంబడి వరుసగా ప్రచురిస్తాం. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజీ | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజి 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుము Foundation for Democratic Reforms పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో చెల్లింగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

**మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా**

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ప్లాట్ నం. బి 504, పాషాకోర్ట్స్, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
loksattatimeslsp@gmail.com

## లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

# రాజ్యాంగానికి ౬౦ ఏళ్ళు

## అయినా... ఇంకా రాజ్యాంగబద్ధపాలనను సాధించుకోలేకపోయాం

**భారత్** తరహా రాజ్యాంగం దిశానిర్దేశం ఉండి ఉంటే, ఫ్రెంచి విప్లవం మహాద్భుత విజయం సాధించేది. ప్రపంచగతి రీతులు మరోలా ఉండేవి. తీరైన మార్గదర్శకత్వం కొరవడటంతో 1789లో వచ్చిన ఆ ప్రజావిప్లవం ఘోరంగా విఫలమైంది. చరిత్రను తార్కికంగా విశ్లేషిస్తే ఈ విషయం సులభంగానే బోధపడుతుంది.

ఉన్నతాశయాలతో, ఉదాత్త లక్ష్యాలతో పరిపుష్టమైన రాజ్యాంగాన్ని స్వాతంత్ర్య సమరసేనానులు మనకు అందించారు. సంవిధానంలోని ప్రతి అక్షరంలో ఎంతో ముందుచూపు, ప్రతి పౌరుడికీ న్యాయం అందించాలన్న తపన తొణికిసలాడతాయి. ఏదో సభ ఆమోదించింది కాబట్టి అన్నట్లు కాకుండా 'మేం...భారత ప్రజలం' అంటూ యావత్ దేశ ప్రజానీకం అంతర్వాణిగా రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకురావడం ఉత్కృష్ట అంశం. రాజ్యాంగం ఈ దేశ ప్రజలకు సార్వభౌమాధికారాన్ని కట్టబెట్టింది. మన రాజ్యాంగంలోనూ కొన్ని లోటుపాట్లు ఉండవచ్చు. కానీ స్వాతంత్ర్యానంతరం 62 ఏళ్ల కాలావధిలో దేశ సమైక్యతను, పౌర స్వేచ్ఛను పరిరక్షించుకోగలిగామంటే... అది రాజ్యాంగం వల్ల, దాన్ని శిరోధార్యంగా భావించి కృషి చేసిన తొలితరం రాజకీయనేతల వల్ల మాత్రమే సాధ్యమైంది. కానీ కాలక్రమేణా రూపం మార్చుకున్న రాజకీయనేతలు రాజ్యాంగాన్ని కేవలం ప్రమాణస్వీకారానికి పనికొచ్చే పుస్తకంగానే మార్చివేశారు. దీనివల్లే దేశంలో సామాజిక అలజడి, విచ్ఛిన్న ధోరణలు ప్రమాదస్థాయికి చేరాయి. రాజ్యాంగస్ఫూర్తిని కాలరాయడం, వర్గాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు సంపాదించడం నేటి రాజకీయ సంస్కృతిగా మారింది. తమ అధికారానికి మూలహేతువు రాజ్యాంగమేనన్న విషయాన్ని నేతలు తేలిగ్గా మరచిపోతున్నారు. సంవిధానాన్ని అపహాస్యం చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించేందుకూ వారు వెనుకాడడం లేదు. పౌరస్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ఊపిరి. రాజ్యాంగ మౌలికసూత్రాల్లో ఇదీ ఒకటి. భారత రాజ్యాంగానికి 19(1) అధికరణం గుండెకాయలాంటిది. వాక్స్వాతంత్ర్యంసహా అన్ని రకాల పౌరస్వేచ్ఛలకూ ఈ ఆర్టికల్ సంపూర్ణమైన భరోసా ఇస్తోంది. రాజ్యాంగంలో 13(2) అధికరణం ప్రకారం దేశంలో పార్లమెంటు సహా ఏ చట్టసభకీ ప్రాథమిక హక్కులను పరిమితం చేస్తూ చట్టం చేసే అధికారం లేదు.



> **భారత రాజ్యాంగానికి 19(1) అధికరణం గుండెకాయలాంటిది. వాక్స్వాతంత్ర్యంసహా అన్ని రకాల పౌరస్వేచ్ఛలకూ ఈ ఆర్టికల్ సంపూర్ణమైన భరోసా ఇస్తోంది. రాజ్యాంగంలో 13(2) అధికరణం ప్రకారం దేశంలో పార్లమెంటు సహా ఏ చట్టసభకీ ప్రాథమిక హక్కులను పరిమితం చేస్తూ చట్టం చేసే అధికారం లేదు.**

### విజ్ఞత అవసరం

రాజ్యాంగాన్ని చిన్నచూపు చూడటం క్షంతవ్యంకాని తప్పు, భేషజాలకు పోకుండా రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని, పాలకులు గుర్తెరిగేలా చేయాల్సిన అవసరముంది. ప్రభుత్వాలు వాస్తవానికి తాము చేయాల్సిన పనులను, విద్య, ఆరోగ్యం, శాంతిభద్రతలు, న్యాయం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటివాటిని అడ్డంగా మరచిపోయి తమ అధికార పరిధిలో లేని కార్యక్రమాలకు పూనుకోవడం ఇటీవల పరిపాటిగా మారింది. రాజ్యానికి ఉన్న పరిమితులుగాని, రాజ్యాంగ విలువలు గాని తెలియనివారు రాజకీయంలో ఉండి సమాజాన్ని శాసిస్తే జరిగే కీడుకి ప్రస్తుత రాజకీయ సంక్షోభం తాజా దృష్టాంతం. రాజ్యాంగం లేకపోతే తమ అధికారాలు, పదవులు ఉండవని, వాటి అంతిమలక్ష్యం ప్రజలకు సేవచేయటంతప్ప ప్రజాప్రయోజనాలు హరించడం కాదన్న వాస్తవాన్ని వారికి బోధపరచాలి. ఇందుకోసం ప్రసారసాధనాలు, పౌరసమాజం కలిసి కదలాలి. ప్రజల్లో చైతన్యాన్ని పెంచాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రాజ్యాంగం సర్వోన్నతమైనదని, దాని పరిధిలోనే చట్టాలు ఉండాలన్న అవగాహనను, స్పృహను కలిగించాలి. రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని సమధిక స్ఫూర్తితో కొనసాగించగలమన్న విశ్వాసం మాది.

### రాజ్యాంగ స్ఫూర్తికి తిలోదకాలు

అసలు రిపబ్లిక్ దినోత్సవం అంటే ఏమిటి? 60 సంవత్సరాల క్రితం... భారత ప్రజలమైన మనం స్వతంత్ర రాజ్యాంగాన్ని

రాసుకున్నాం. మన రాజ్యవ్యవస్థ, పాలన తీరు ఎలా ఉండాలో నిర్వచించుకున్నాం. పౌరులకు కొన్ని జన్మహక్కులున్నాయని, అవి మనకు మనం ప్రసాదించుకున్నవని, ఏ ఒక్కరి దయాదాక్షిణ్యాలవల్ల కాక మనుషులుగా మనకు అవి సహజమైన హక్కులని ఎలుగెత్తి చాటుకున్నాం. మనమే పాలకులమని, స్వరాజ్యమంటే సొంతపాలన అని, మనమెన్నుకున్న ప్రతినిధులు, మనం ఎంపిక చేసిన ఉద్యోగులు కేవలం మన సేవకులు మాత్రమేనని, వాళ్లంతా మన ఉప్పు తింటున్నవాళ్లని, మనకు జవాబుదారీగా ఉండవలసినవాళ్లని, వాళ్లు ఖర్చు చేసేది మన డబ్బుని, వాళ్లు వినియోగించేది మనం కట్టబెట్టిన పరిమిత అధికారమని, వాళ్లు భక్తితో కొలవవలసింది కాదని నిర్ద్వంద్వంగా ఖరారు చేసుకున్నాం. ఈ పౌర సార్వభౌమత్వం ప్రాణంగా, వ్యక్తి స్వేచ్ఛ ఊపిరిగా, వయోజన ఓటుహక్కు పునాదిగా, పాలకుల జవాబుదారీతనం ఆలంబనగా మన రిపబ్లిక్‌ను ప్రారంభించుకున్నాం. అయితే కాలక్రమేణా మన రాజ్యాంగం మనం సృష్టించుకున్న అత్యద్భుత కాల్పనిక సాహిత్యంగా, ఓ అందమైన కలగా మిగిలిపోయింది. పౌర సార్వభౌమత్వం కాగితం మీద నిలిచిపోయింది. మన సేవ కోసం పదవులందుకున్నవాళ్ళు మన నెత్తినెక్కి స్వారీ చేసే అసాములుగా చలామణీ అవుతున్నారు. వాళ్లను అందలాలెక్కించిన మనం పన్నులిచ్చి తన్నులు తినే బానిసలుగా మారిపోయాం. సార్వభౌములుగా తలెత్తుకు తిరగాల్సిన మనం మన పేరుతో అధికారంలో ఉన్నవాళ్లకు దాసోహం అంటూ ఆత్మన్యూనతకు అలవాటుపడ్డాం. ఉదయం నిద్రలేచిన దగ్గర నుండి రాత్రి మళ్లీ విశ్రమించేవారకూ రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చాం. ఏటా మన పేరుతో ఆరు లక్షల కోట్ల రూపాయల మన డబ్బును వెచ్చించే ప్రభుత్వాలు మనకవసరమయిన కనీస వసతులు కల్పించటంలో విఫలమవుతున్నాయి. తాగేనీరు కూడా తీరని కోరికగా మిగిలిపోయింది. పదేళ్లలో అందరికీ అక్షరజ్ఞానం అందటం మన ధ్యేయంగా ప్రకటించుకున్నాం కాని వాస్తవానికి 60 సంవత్సరాలు గడిచాక కూడా ప్రపంచంలో సగంమంది నిరక్షరాస్యులకు భారత్ జన్మభూమి అయింది. సామాన్యుడికి కనీస ఆరోగ్య సదుపాయం అందటం అసాధ్యమయింది. నివారించదగ్గ వ్యాధులకు కోట్లమంది బలయిపోతున్నారు. దేశ జనాభాలో అత్యధికులకు ఉత్పత్తితో కూడిన ఉపాధి కరువయింది. చుట్టూ ఎన్నో వనరులు, అవసరాలు ఉన్నా, వాటిని సంధానించే ధ్యాస కాని, సమన్వయం చేసే చేవగాని లేని ప్రభుత్వాల నిర్వాకం పుణ్యమా అని దేశమంతటా నిరుద్యోగం తాండవిస్తోంది. సమాజంలో ఆర్థిక ప్రగతికి అవసరమయిన మౌలిక సదుపాయాలు కరవైనాయి. మనం ఏర్పరచుకున్న పాలనా వ్యవస్థ కనీసం శాంతిభద్రతలను కాపాడి సకాలంలో సమర్థ సహాయాన్నందించే చట్టబద్ధ పాలనను మనకివ్వలేకపోయింది. రాజ్యాంగం పేరుతో ఏర్పడ్డ రాజ్య వ్యవస్థ ఎందుకున్నదీ అంటే, మనల్ని దోచుకోవటం కోసం అనే సమాధానం లభిస్తున్నది. మన రాజ్యంలో మనం ఆత్మగౌరవం లేని అభాగ్యులుగా నిస్సారమైన జీవితాలను గడుపుతున్నాం. అసలు పరిస్థితులు మారలేదంటే అసత్యం అవుతుంది. 'రాజుల సొమ్ము రాళ్లపాలు' అని ఒకనాటి సామెత. ప్రజల సొమ్ము పాలకుల పాలు అనేది నేటి నిర్వాకం. ఎటు చూసినా రాజకీయం పేరుతో నిరంతరం జరిగేది అధికారక్రీడ. అధికారం ఓ లక్ష్యంగా జీవన పరమావధిగా మారిపోయింది. 'అధికారం ఎందుకు? అని ప్రశ్నిస్తే వచ్చే సమాధానం 'ప్రజా ధనం దోచుకోవటానికి' అని. ఆ అధికారం అందుకోవటానికి సాధనం ఎన్నికలు. కోట్ల రూపాయల ఖర్చుతో ఎన్నికల ప్రక్రియ ఓ జూదంలాగా మారిపోయింది. ఆధునిక రాచరికం కోసం జరిగే ఈ యుద్ధంలో ప్రజలు సమిధలుగా మారిపోయారు. పాలనను పూర్తిగా కేంద్రీకరించి, పౌరుడిని సుదూరంగా ఉంచి చట్టబద్ధమైన చౌర్యానికి పాల్పడుతున్నారు. ప్రజలను నిరంతరం ప్రచ్ఛన్న నిరంకుశత్వానికి బానిసల్ని చేస్తున్నారు. గద్దెనెక్కినవాళ్లు అధికారం తమకు దైవదత్తంగా భావిస్తూ రాజ్యాంగబద్ధమైన దోపిడీని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. జవాబుదారీతనం అనేది కేవలం కాగితాలకు పరిమితమైంది.

**పౌర సార్వభౌమత్వం ప్రాణంగా, వ్యక్తి స్వేచ్ఛ 'ఊపిరిగా, వయోజన ఓటుహక్కు పునాదిగా, పాలకుల జవాబుదారీతనం ఆలంబనగా మన రిపబ్లిక్‌ను ప్రారంభించుకున్నాం.**

అధికారం అంటే స్వలాభం కోసమనే సంప్రదాయం, లంచం మింగటం జన్మహక్కనే అనవాయితీ బలంగా వేళ్లూనుకున్న మన రాజ్యవ్యవస్థలో విస్తుపోతూ చూస్తూ మిన్నకుండిపోవటం మన వంతయిపోయింది. కనీసం మధ్యయుగాలలో కూడా శాంతిభద్రతలని కాపాడటం, సకాలంలో న్యాయాన్నందించటం పాలనకు కనీస నిర్వచనంగా ఉండేది. కానీ నేరచరితులే పాలకులై, పోలీసు యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసి, న్యాయవ్యవస్థను నీరసపరచి అరాచకత్వానికి దారితీశారు. ఇదీ మన పాలకుల నిర్వాకం.

అయితే ఎన్ని బలహీనతలున్నా మన సమాజంలో ఇంకా అంతర్గత బలం పుష్కలంగా ఉంది. సాంఘిక అసమానతలను నింపాదిగా ఆమోదించే తత్వం, పైవాళ్ల అడుగులకు మడుగులొత్తడం, కింది వాళ్లను నీచంగా కించపరచటం, మందిహితం కోసం వ్యక్తి ప్రవర్తనను నిబద్ధించలేని అశక్తి మన సమాజానికున్న ప్రధానమైన బలహీనతలు. అయితే ఇదే సమాజంలో సామాన్యులలో నీతి, నిజాయతీలు పుష్కలంగా ఉన్నాయి. ధర్మాధర్మ విచక్షణ అత్యధికుల ప్రవర్తనను

నియంత్రిస్తోంది. చాలామంది సంపన్నులలో కేవలం దైవభక్తి ఉన్నా పాపభీతి మచ్చుకు కూడా కానరాదు. కానీ సామాన్యుల్లో పాపభీతి చాలా బలంగా ఉండి వాళ్లను సన్మార్గాన నడిపిస్తోంది. అంతకుమించి సమాజంలో పదిమంది ముందూ చులకన అవుతామేమోననే బిడియం సగటు మనిషిని నియమబద్ధుణ్ని చేస్తోంది. చేతిలో రూపాయి లేకపోయినా ముఖంలో సంతోషం తాండవించటం, గుండెనిండుగా మానవతా కుసుమాలు వికసించటం కోట్ల మంది బడుగుజీవుల్ని నిశితంగా పరిశీలించే ప్రతివాళ్లకూ అనుభవం. ఈ సమాజంలో ఇంకా శాంతిభద్రతలున్నాయంటే, ఆ ఘనత మన చట్టాలదీ, పోలీసులదీ, న్యాయస్థానాలదీ కాదు; కేవలం మన సమాజంలో ఉన్న అంతర్గత బలానిది. ఇంకా ఈ దేశంలో మనుషుల నాగరిక ప్రవర్తన, వివిధ వర్గాల మధ్య సయోధ్య ఉన్నాయంటే ఆ కీర్తి, మన పార్టీలకు, రాజకీయాలకు చెందదు. అది కేవలం మన ప్రజలకు శతాబ్దాల పర్యంతం అలవాటై మన ప్రవృత్తిలో భాగమయిన సహజీవన సంస్కృతి చిహ్నం. అంటే ఎన్ని లోపాలున్నా మన సమాజం ఇంకా మన రాజ్యవ్యవస్థను సంస్కరించే శక్తిని కోల్పోలేదు. ఎంతటి దుర్బలత్వం ఉన్నా మన ప్రజలు ఇంకా ఈ రిపబ్లిక్‌ను తిరిగి అందుకోలేని అశక్తులు కారు. ఎంతటి నహనం ఉన్నా మన జాతి ఇంకా దుష్పరిపాలనను ఎదిరించి పోరాటం చేసే సాహసాన్ని, చేవను కోల్పోలేదు. మన రిపబ్లిక్‌ను మనం రక్షించుకోవాలంటే, రిపబ్లిక్ విలువలు బతకాలంటే మనం మళ్లీ సార్వభౌములం కావాలంటే మన సమాజంలో

**ఈ సమాజంలో ఇంకా శాంతిభద్రతాలున్నాయంటే, ఆ ఘనత మన చట్టాలదీ, పోలీసులదీ, న్యాయస్థానాలదీ కాదు; కేవలం మన సమాజంలో ఉన్న అంతర్గత బలానిది.**

నిద్రాణంగా ఉన్న శక్తిని కదిలించాలి. టాగూర్ మాటల్లో అభ్యాసపుటెడారిలో ఆలోచనా విజ్ఞాన తరంగిణులు ఇంకిపోతున్నాయి. అలాంటి అంధవిశ్వాసాల ఊబి నుంచి బయటపడి అందమైన ప్రపంచాన్ని సృష్టించుకునే శక్తి మన జాతికి ఉంది. మనకు సమస్యలనేకం. కాని అవేవీ మన విజ్ఞతకు, మానవ మేధకు, మనకున్న వనరులకు అతీతమైనవికావు. గత ఐదు శతాబ్దాలలో జాతికి స్వయంపోషణనిచ్చిన వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. పాఠశాల విద్య కోట్లమందికి కరవు కాగా, సమాజంలో పరిష్కారాలను అన్వేషించవలసిన ఉన్నతవిద్య ఓ పెద్ద సమస్యగా తయారయింది. ఆధునిక జీవనంలో ప్రగతి రథచక్రాలకు చోదకశక్తి అయిన విద్యుత్తు రంగం మన దుష్పరిపాలన పుణ్యమా అని తీవ్ర సంకటంలో పడి మన భవిష్యత్తుకు ప్రతిబంధకమయింది. కోట్లమంది యువతీయువకులు చిన్నతనంలోనే శక్తి ఉడిగి, ధైర్యం నశించి, ఉపాధి లేక దైన్యంగా నిరాశతో ఊగిసలాడుతున్నారు. ఎంతో చేయవలసిన పని ఉన్నా చేయగల పని కనిపించక యువత నిద్రాణమైపోతోంది. సంపద సృష్టించవలసిన సహజ వనరులు సద్వినియోగం కాక నిరర్థకంగా పడి ఉన్నాయి. ఇవన్నీ ఎంత పెద్ద సవాళ్లయినా ఆధునిక యుగంలో వీటిని ఎదుర్కొనే మార్గాలనేకం ఉన్నాయి. ఇవేవీ భారత జాతికి కొత్తగా పట్టిన జాడ్యాలు కావు. ఎన్నో సమాజాలు గతంలో ఎదుర్కొని సమర్థంగా పరిష్కరించుకున్న సమస్యలే. వీటిని అధిగమించే శక్తి మనకు ఉంది. అయితే ఈ పరిష్కారాలకు తొలిమెట్టు రాజ్యవ్యవస్థ పునర్నిర్మాణం; మనం కోల్పోయిన రిపబ్లిక్‌ను మళ్లీ మన ప్రజల ఆస్తిగా అందించటం. ఎన్నికల ప్రక్షాళన, అవినీతిఅంతం, అధికార వికేంద్రీకరణ, దాపరికం లేని పారదర్శక పాలన, కనీస జీవన ప్రమాణాలను నిలబెట్టే ప్రజాధన వినియోగం, మన సేవకులలో మనకు జవాబుదారీతనాన్ని నిలబెట్టే సాధనాలు – ఇవన్నీ మన రిపబ్లిక్‌ను కాపాడుకోవటానికి మనం తక్షణం చేపట్టవలసిన చర్యలు.

**తలచుకుంటే పరిష్కారాలు సులువే**

ఢిల్లీ నగర వీధులలో జరిగే సైనిక కవాతులలోనో, యుద్ధ విమానాల ప్రదర్శనలలోనో, పాలకుల ఆడంబరాలలోనో, చిత్తశుద్ధి లేని ప్రసంగాలలోనో మన రిపబ్లిక్ లేదు. నిజమైన రిపబ్లిక్ స్ఫూర్తి ప్రజల జీవన విధానంలో, సామాన్యుడి ఆత్మగౌరవంలో, ప్రజల ఆత్మవిశ్వాసంలో, పౌర సార్వభౌమత్వంలో, పాలకుల సేవకత్వంలో, సేవకుల జవాబుదారీతనంలో పుట్టిన ప్రతి బిడ్డలో వికసించే ప్రతిభా పాటవాలో, ప్రతివ్యక్తికీ అందే ఆరోగ్య సేవలలో, దోపిడీ లేని పాలనలో, తలవంచని పౌరసత్వంలో ఉంది. ఆ స్ఫూర్తిని బతికించాలంటే వెంటనే సంఘటిత పోరాటం కావాలి. మౌన రోదన మాని జాతి జవజీవాల రక్షణకు నడుం కట్టాలి. ఇది మన బిడ్డల భవిష్యత్తు కోసం, మన జాతి పునరుజ్జీవనం కోసం, కోల్పోయిన మన రిపబ్లిక్‌ను తిరిగి పొందటం కోసం మనం చేపట్టవలసిన కనీస చర్య మన నేతల నిర్వాకం పుణ్యమా అని లక్షల కోట్ల రూపాయలు ఏటా వెచ్చించే ప్రభుత్వాలు దివాలా అంచున ఉన్నాయి. మన బిడ్డలను అప్పుల ఊబిలో దింపేశాయి. యథాస్థితి కొనసాగించటం అసాధ్యమయిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. మన డబ్బుతో మనమీద పెత్తనానికి అలవాటుపడ్డ పాలకులు తమంత తాము మార్పుల కోసం నడుం కట్టరు. తమ గోతిని తామే తవ్వుకోరు. కానీ మార్పు లేనిదే మనుగడ లేని పరిస్థితి జాతి భవిష్యత్తును నిర్దేశిస్తోంది. ఈ చరిత్ర గతిని గమనించి సకాలంలో సరైన చర్యలు చేపట్టడం పౌరులుగా మన కర్తవ్యం. అప్పుడే మనం కోల్పోయిన రిపబ్లిక్ మనదవుతుంది. ■

# పోటాపోటీ విధ్వంసం చేసే రాజకీయం పోవాలి



***"ఆంధ్రప్రదేశ్‌లో పాలన అనేక రంగాల్లో మందగించింది. కొన్ని విభాగాల్లో పూర్తిగా స్తంభించింది. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే రాజ్యాంగ వైఫల్యం ఏర్పడుతుంది.***

***ఏ ప్రభుత్వమైనా శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు రక్షణ కల్పించినప్పుడే అభివృద్ధి కొనసాగుతుంది. జనజీవితం సాఫీగా కొనసాగుతుందని భరోసా కల్పించాల్సి ఉంటుంది. కానీ ఈవేళ ఆంధ్రప్రదేశ్‌లో కేబినెట్ పనితీరు దాదాపు స్తంభించిపోయింది. పాలనాయంత్రాంగం నిర్వీర్యమైపోయింది.***

"బంద‌లు, రాస్తారోకోలు, రైలురోకోలతో మార్కెటింగ్ కార్యకలాపాలను ఛిన్నాభిన్నం చేయటం ద్వారా పార్టీలు అటు ఉత్పత్తిదారుల, ఇటు వినియోగదారుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీశాయి. రోజుకూలీలు, కూరగాయల వ్యాపారులు, సాధారణ కార్మికులు పొట్ట పోసుకోవటమే కష్టమయ్యే పరిస్థితి ఏర్పడింది. తమ తమ అభిప్రాయాలవైపు కేంద్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు సామాన్య ప్రజల్ని దెబ్బతీసే రీతిలో ఆందోళనలకు దిగటం ... ముఖం మీద కోపంతో ముక్కు కోసుకున్న తరహాలో ఉంది".

శాంతియుతంగా, సుహృద్భావ వాతావరణంలో జీవించాలనుకునే అత్యధిక సంఖ్యాక ప్రజానీకం పార్టీల రాజకీయ క్రీడలో బాధితులుగా మారారు. మీడియా, పౌరసమాజం మౌనాన్ని వీడి సాధారణ పౌరుడి తరపున మాట్లాడాలి. "కొందరు వ్యక్తులు, కొన్ని పార్టీలు బాధ్యతాయుతంగానే ఉన్నా స్థూలంగా పార్టీలు, పౌరసమాజం, మీడియా కూడా సమస్యలో భాగంగానే ఉన్నాయి. ఇప్పటికైనా స్పృహ తెచ్చుకుని పరిష్కారం కోసం ప్రయత్నం ప్రారంభించాలి".

భారత ప్రభుత్వం చర్చల ప్రక్రియను ప్రారంభించటం స్వాగతించదగ్గ పరిణామం. గుర్తింపు పొందిన పార్టీ అనే ప్రాతిపదికన లోక్‌సత్తాకు చర్చల్లో అవకాశం లేకపోయినా దానికి జాతీయ ప్రభుత్వాన్ని తప్పుపట్టాల్సిన పన్లేదు. "ఇప్పటిదాకా బలసమీకరణకు విద్వేషాల్ని రెచ్చగొడుతూ విశృంఖలంగా ప్రవర్తించిన పార్టీలు ఇకనైనా బాధ్యతను గుర్తించి నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. రాష్ట్రం విడిపోవటం వల్ల ఉపద్రవం రాదు. అలాగే ప్రత్యేక రాష్ట్రం వచ్చేయటం వల్ల ప్రజల జీవితాల్లో అద్భుతాలు జరగబోవు, ప్రజల్లో ద్వేషాన్ని పెంచటానికి పెద్ద తెలివితేటలు, నాయకత్వ లక్షణాలు అవసరంలేదు. సంయమనంతో పరిష్కారాలు చెప్పటానికే నాయకత్వం కావాలి. పత్రికలు, ఛానళ్లు కూడా ఇందుకు సహకరించాలి. సంక్షోభాన్ని ఓ అవకాశంగా మలచుకునే కృషిని ప్రారంభించాలి.

రాష్ట్రాల విభజన జాతీయ సమస్య. రాబోయే 20ఏళ్లలో దేశంలో ఇదో పెద్దసమస్యగా మారబోతోంది. దేశ ఐక్యతను మౌలికాంశంగా భావించి దీనికి పరిష్కారాల్ని వెతకాల్సి ఉంది. చైనా లాగా 200 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యవహరించలేకపోయినా, కనీసం ఒక్క తరాన్ని దృష్టిలో పెట్టుకునైనా ఇప్పుడు పార్టీలు, సమాజం వ్యవహరించాలి. అందుకే జిల్లా ప్రభుత్వాలు, నగర ప్రభుత్వాలను ఏర్పాటు చేసి 'ప్రజలకే అధికారం' అందించే ఏర్పాటుకు భారత ప్రభుత్వం, పార్టీలు పోరాడాల్సి ఉంది. "1970-90 మధ్య సమాఖ్య వ్యవస్థ గురించి చర్చ జరిగింది. సమాఖ్య వ్యవస్థ మూడో అంచె (థర్డ్ టైర్ ఆఫ్ ఫెడరలిజం) గురించి ఆలోచన చేయటం ఈరోజు మనముందున్న తక్షణావసరం" 73, 74వ రాజ్యాంగసవరణల్ని కాంగ్రెస్, ఎన్డీయే, యూపీయే ప్రభుత్వాలు పూర్తిగా కాలరాయటం వల్లే ఇప్పటికీ స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు సాకారం కాలేదు. జాతీయ ప్రభుత్వం నుంచి 40-45శాతం నిధులు నేరుగా జిల్లా, నగర ప్రభుత్వాలకు రావాలని, రాష్ట్రస్థాయిలో 20శాతంకే పరిమితం చేయాలి. చర్చల్ని కేవలం రాజకీయ పార్టీలకే పరిమితం చేయకూడదు. పౌరసమాజ సంస్థల అభిప్రాయాల్ని కూడా భారత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని అన్ని ప్రాంతాల ఆకాంక్షల్ని నెరవేర్చే, ఆందోళనల్ని తొలగించే పరిష్కారాన్ని తీసుకురావాలి.

చర్చల ప్రక్రియ ప్రారంభమైందికాబట్టి అన్ని రాజకీయపార్టీలు, ఇతర సంస్థలు వీధుల్లో అన్నిరకాల ఆందోళనలకూ స్వస్తి చెప్పి, నిజాయితీతో, హేతుబద్ధతతో, స్పష్టమైన వాస్తవిక దృక్పథంతో చర్చల ప్రక్రియలో పాల్గొనాలి. "హింసాత్మక దాడులతో కాకుండా చిత్తశుద్ధితో కూడిన చర్చల ద్వారానే వివాదాల్ని పరిష్కరించుకోవాలని రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం నిర్దేశిస్తోంది" ■

**తెలంగాణాను ఏర్పాటు చేయడం లేదా రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడం అనేది కేవలం రాజకీయ, పరిపాలనాపరమైన ఏర్పాటు మాత్రమే**

# నాయకులలో ప్రజలను ప్రభావితం చేయగల వ్యక్తిత్వ నిర్మాణం జరగాలి



**గన్‌రెడ్డి రాజారెడ్డి**

సమాజంలో మనిషి వ్యక్తిత్వానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. వ్యక్తిత్వంలోని చాలా లక్షణాలు పుట్టుకతో వచ్చేవే. అంతే కాకుండా ప్రతీ వ్యక్తి వ్యక్తిత్వము ప్రత్యేకమైనదిగా ఉంటుంది. మనిషి యొక్క వ్యక్తిత్వాన్ని సమూలంగా మార్చడమనేది సాధ్యం కానప్పటికీ సమాజంలోని వివిధరంగాలకు అవసరమైన వివిధ లక్షణాలను సమాజంలోని వ్యక్తిత్వంలో కొన్ని మార్పులు చేసుకొనే అవకాశం ఉన్నది. నేర్చుకోవడం ద్వారా వ్యక్తిత్వంలో లోపాలు కలగవచ్చు లేదా వ్యక్తిత్వ వికాసము జరగవచ్చు. మంచిగానీ, చెడుగానీ మనిషి నేర్చుకోవడం ద్వారా జరిగే ప్రక్రియ.

సామాజిక రాజకీయ పరిజ్ఞానం, శాస్త్రీయపరిజ్ఞానం, సామాజిక పరిజ్ఞానం ఇవన్నీ కూడా పునాది వంటివి. సమాజంలోని వ్యక్తులకు వీటిలోని దేనిలోనైన సరియైన పరిజ్ఞానము, అవగాహన లోపించినట్లయితే పునాది బలహీనపడి సమాజనిర్మాణం సరియైన రీతిలో జరగకపోయే అవకాశం ఉన్నది. అయితే దీనికి సరియైన రీతిలో నేర్చుకోవడం ఒక్కటే సరియైన మార్గము. నేడు మనం శాస్త్రీయపరిజ్ఞానాన్ని సామాజిక పరిజ్ఞానాన్ని ఒక అవసరంగా భావించి వీటిని విద్య ఇంకా ఇతర విధానాల ద్వారా శాస్త్రీయ పద్ధతుల ద్వారా నేర్చుకుంటున్నాము. కాని రాజకీయ పరిజ్ఞానాన్ని మాత్రం సరియైన రీతిలో నేర్చుకుంటున్నట్లు లేదు. నేటి పోటీ ప్రపంచంలో వివిధ రకాల ఒత్తిడిలతో సతమతమయ్యే మనిషి రాజకీయ పరమైన సమస్యల పట్ల సరియైన రీతిలో స్పదించాలంటే శాస్త్రీయమైన రాజకీయ అవగాహన అవసరము. అయితే అధిక జనాభా గల మన సమాజంలో అతి కష్టమైన పని అనుకుంటే దానికంటే ముందుగా నాయకత్వం వహించే వ్యక్తికి ప్రజలకు ప్రభావితం చేయగల వ్యక్తిత్వం కలిగి ఉండాలి అవసరమైతే అలాంటి వ్యక్తిత్వ నిర్మాణం చేసుకోవాలి. మనిషి విషయ పరిజ్ఞానం అనేది సత్యగ్రహణ శక్తి (Cognition) ద్వారా జరుగుతుంది. ఇది జరగాలంటే ప్రాథమిక అంశాలు శాస్త్రీయమైనవిగా నిక్షిప్తమైతే ఆ తరువాతి పరిజ్ఞానమంతా కూడా సరియైన రీతిలో విశ్లేషణ జరుగుతుంది. ఈ క్రమంలో నాయకత్వానికి కూడా కొన్ని ప్రాథమిక అంశాలుంటాయి. అని నాయకుని ఆలోచనా వ్యవస్థ (Cognition) లో నిక్షిప్తమైనప్పుడే అతని సత్యగ్రహణ శక్తి వికసిస్తుంది. దాని ద్వారా ప్రజలను ప్రభావితం చేయగల నాయకుడుగా ఎదిగే అవకాశం ఉంటుంది. నాయకత్వమంటే డబ్బు ద్వారా లేదా ఇతరత్రా ప్రలోభాల ద్వారా ప్రజలను ప్రభావితం చేసి అధికారం పొందడం, తరువాత స్వార్థపూరిత ప్రక్రియలో భాగం కావడం తద్వారా సమాజానికి దిశానిర్దేశం లేకుండా చేయడం అనే విధంగా జరుగుతున్నది. ఇలాంటి ఈ వ్యవస్థలో మార్పు సులభం కాకపోయినప్పటికీ అసంభవం కాదు. నాయకత్వం వహించాలనుకునే వారు ప్రజలను ప్రభావితం చేయగల గల వ్యక్తిత్వ నిర్మాణం చేసుకోవడం ద్వారా మార్పు సాధించవచ్చు. ఈ దిశలో సరియైన నాయకత్వం కొరకు కొన్ని ప్రాథమిక అంశాలను తెలుసుకోవలసిన అవసరం ఉన్నది వీటిలో కొన్ని.

**కార్యకర్తలకు విషయ పరిజ్ఞానాన్నిస్తూ ప్రేరేపించాలి.** అలా కాకుండా కేవలం ఆజ్ఞాపించడం ద్వారా నాయకత్వం వికసించదు. Lao tsu మాటలలో చెప్పాలంటే "తన నాయకత్వంలో ఉన్న ప్రజలు ఎప్పుడైతే మా సమస్యలను మేము పరిష్కరించుకుంటాము అని చెప్పగల స్థితికి వస్తారో అప్పుడే అది పరిపూర్ణమైన నాయకత్వం అవుతుంది."

**ధైర్యము, విశ్వాసము, నమ్మకము కలిగి ఉండాలి.**

సాధారణంగా మనిషి మనస్తత్వము ఎప్పుడుకూడా ముందుగా అనుమానము కలిగి ఉండి. చెడును ఊహిస్తుంది. కాబట్టి నాయకునికి సరియైన గమ్యము నిర్థిష్టమైన ఆశయము దానిని సాధించగలననే విశ్వాసము ఉండటమే కాకుండా ఆ విశ్వాసము నమ్మకము, ధైర్యము తన మాటలలో, ప్రవర్తనలో

ప్రతిబింబించబడినప్పుడు మాత్రమే ప్రజలు ఆ నాయకత్వాన్ని ఆమోదించి అనుసరిస్తారు.

**తన తప్పులను అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి.**

తప్పును అంగీకరించాలంటే నిజాయితీ ఉండాలి. తప్పు నిజాయితీ నుండి జరిగినదై ఉండాలే తప్ప ఉద్దేశపూర్వకంగా చేసినది కాకూడదు. అలాంటి పరిస్థితులలో మాత్రమే ఆ చేసిన తప్పును అంగీకరించే ధైర్యము వస్తుంది.

వ్యక్తిలోని ego జరిగిన తప్పును అంగీకరించడానికి అడ్డంకిగా మారుతుంది. ఈ సందర్భంలో మనకు చేరవలసిన గమ్యం చేయవలసిన పనులు దానికి కావలసిన ప్రజల మద్ధతు గురించిన స్పష్టమైన అవగాహన ఉన్నట్లయితే ego ను తగ్గించుకునే శక్తి లభిస్తుంది. దీనితో పాటు ప్రజలలో కూడా పరిశీలనలు తెలివైనవారు ఉన్నారనే విషయాన్ని గుర్తించినట్లయితే తప్పు అంగీకరించడానికి మార్గం సులభమవుతుంది.

**బాధ్యతలను సరియైన రీతిలో ఇతరులకు అప్పగించాలి.** నాయకత్వం వహించేవారు అన్ని పనులు తానే చేస్తూ ఉంటే కార్యకర్తలలో విశ్వాసం సన్నగిల్లే అవకాశం ఉంటుంది. అర్హులైన వారిని గుర్తించి వారికి సరియైన రీతిలో బాధ్యతలను అప్పగించినపుడే నాయకత్వంపై విశ్వాసం పెరుగుతుంది.

**ఇతరుల నుండి నేర్చుకునే తత్వము కలిగి ఉండటం.**

నాకు అన్ని విషయాలు తెలుసు, నాకు ఎవరూ ఏమీ చెప్పనవసరం లేదు. నేను నా చుట్టూ ఉన్న సమాజంలోని అందరికంటే తెలివైనవాన్ని అనే భావన ఇతరుల నుండి కొత్త విషయాలు నేర్చుకోవడానికి అడ్డంకిగా మారుతుంది. ఇక్కడ నాకు తెలియని విషయాలు ఉండాలి. ఒక్కొక్కరు ఒక్కొక్క విషయంలో నిష్ణాతులై ఉంటారు. కాబట్టి వారి నుండి కొన్ని విషయాలు నేర్చుకోవాలి. అనే దానికి, తనపై తనకు నమ్మకం లేకపోవడానికి మధ్యన రేఖ చాలా సున్నితమైనది. ఈ రెండు పూర్తిగా వ్యతిరేక భావాలు తనపై తనకు పూర్తి నమ్మకాన్ని ఉంచుకొని తెలియని విషయాలను ఇతరుల నుండి నేర్చుకోవాలనే భావన నాయకత్వానికి బలాన్ని చేకురుస్తుంది.

**త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉండాలి.**

నాయకత్వమంటేనే ప్రజల సమస్యలను తన సమస్యగా భావించేది. ప్రజల సమస్యలను పరిష్కరించే క్రమంలో తన స్వంత సమస్యలను పరిష్కరించుకునే అవకాశం దొరకకపోవచ్చు. ప్రజల కోరికలను తీర్చే సందర్భంలో తన కోర్కెలను తీర్చుకునే అవకాశం లభించకపోవచ్చు. ప్రజల మనిషిగా గుర్తించబడాలంటే స్వయంలబ్ధిని, సుఖాలను వదులుకోవలసిన సందర్భం వస్తే వదులుకునే గట్టి వ్యక్తిత్వం ఉంటేనే నాయకత్వం బలపడుతుంది.

**నాయకత్వం ఎప్పుడూ ఇతరులలోని మంచితనాన్ని గుర్తించేదిగా ఉండాలి.**

నాయకత్వస్థానంలో ఉన్నవారు, ఇతరులలోని మంచితనాన్ని గుర్తించగలగే విధానాన్ని అలవరచుకోవాలి. దానిని మాటలతో బయటపెట్టగలగాలి. అంతే కాకుండా ఆచరణతో చూపగలగాలి.

**విమర్శలను వినడం నాయకత్వానికి ఆస్తి వంటిది.**

తనను ఎవరైనా విమర్శిస్తుంటే భావోద్వేగాలకు లోనుకావడం సహజం. కాని నాయకత్వ స్థానంలో ఉన్నవారు తనపై వచ్చే విమర్శలలోని వాస్తవాన్ని గుర్తించగలిగే లక్షణాన్ని అలవరించుకోవాలి. మొదట నిశ్శబ్దంగా వినడం అలవాటు చేసుకొని, ఆ తరువాత విన్నదాన్ని విశ్లేషించగలిగితే దానిని ఇతరులు అనుసరించే అలవాటు చేయాలి. మొదట మనం ఎదుటివారు చెప్పేది వినటం, వారి సమస్యలను పరిష్కరించటం మొదలు పెడితే వారు మనం చెప్పేది వినటం అలవాటు చేసుకుంటారు. మీరు చెప్పే దాంతో నాకు పనిలేదనో, నాకు అంతా తెలుసు మీరేమీ చెప్పనవసరం లేదనే భావించి నేను చెప్పేది మాత్రం మీరు వినాలనే భావన నాయకత్వానికి పూర్తిగా వ్యతిరేకమైనది.

(రచయిత హ్యూమన్ బిహేవియర్ రిసర్చ్ ఫౌండేషన్‌కు పరిశోధకులుగా పనిచేస్తున్నారు.)

**దినపత్రికల హెడ్‌లైన్లు, న్యూస్ ఛానెళ్ళ 24 గంటల వార్తాబులెటిన్లను చూసి పార్టీలు ఎజెండాను మార్చుకోవల్సిన అవసరం లేదు.**

### పౌరకేంద్ర సిద్ధాంతం (థియరీ ఆఫ్ సబ్సీడియారిటీ)

# పౌరుడు కేంద్రంగా పాలన సాగాలి



బండారు రామ్మోహన్‌రావు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక రెండున్నర సంవత్సరాలకు మనం ఒక రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చుకున్నాం. 1950 జనవరి 26న ఈ రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అందులో ప్రధానంగా ప్రపంచంలోని ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఉన్న మంచి విషయాలను క్రోడీకరించి యూనిటరీ, ఫెడరల్ ఉమ్మడి పాలనావ్యవస్థను మనం ఎంచుకున్నాం. కేంద్రంలో జాతీయ ప్రభుత్వాన్ని, రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వాలని ఏర్పరచుకున్నాం. ఆనాడు గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం అంశాన్ని ఆదేశిక సూత్రాలలో పొందుపరచుకున్నాం. అలాగే మద్యనిషేధం, గోవధనిషేధం లాంటివి కూడా ఆర్టికల్ 40లో చేర్చాం. అంటే ఆనాడు దేశంలో రెండంచెల పాలనావ్యవస్థనే మనం ఎంచుకున్నాం. రాజ్యాంగంలో ఎక్కడా కూడా కేంద్రప్రభుత్వం అనేమాట లేదు. దాన్ని జాతీయప్రభుత్వంగా చెప్పుకోవచ్చు. వాడుకలో మనం సెంట్రల్ గవర్నమెంట్‌గా పిలుస్తున్నాం. అలాగే రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం వరకు మనం అధికారం అనేది పంచాం. అందుకే జాతీయప్రభుత్వం విధులు, రాష్ట్రప్రభుత్వం విధులు అలాగే ఉమ్మడి జాబితాలో ఇరుప్రభుత్వాలకి కొన్ని విధుల్ని మనం కేటాయించాం. దాన్నే ఉమ్మడి జాబితా అంటాం.

రాజ్యాంగంలో రాసుకోకపోయినా, పాలనాపరమైన వెసులుబాటు కోసం భారతదేశం అంతటా గ్రామీణ పాలనావ్యవస్థను, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సమాజ అభివృద్ధి కేంద్రాలుగా (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్స్) బ్లాక్‌స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. అదికూడా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్ళే క్రమంలో పంచాయితీరాజ్ వ్యవస్థ అవసరమైంది. 1959లో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ప్రారంభించుకున్నాం. ఇందులో గ్రామ పంచాయతీ మొదలుకుని మధ్యంతర వ్యవస్థ, అలాగే జిల్లా పరిషత్ వరకు మూడంచెల పాలన సాగేది. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి లేకున్నా కొంచెం కుడి ఎడంగా ఎన్నికలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా వీటి ద్వారానే సాగేవి. అటు పార్లమెంటు సభ్యులుగాని, ఇటు విధాన పరిషత్, విధాన మండలి సభ్యులుగాని, ప్రజోపకరమైన చట్టాలు చేయడం వరకే పరిమితం అయ్యేవారు. స్థానిక పరిపాలన అంతా పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే సాగించేవారు. 1991లో 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్, మున్సిపల్ పాలనకు రాజ్యాంగ ప్రతిపత్తి ఇవ్వడం ద్వారా మూడంచెల పాలనకి దేశమంతటా శ్రీకారం చుట్టారు. దేశంలో ఏదోవిధంగా పంచాయతీరాజ్ వ్యవస్థలు అప్పటికే అమలులో వున్న అంచెల ఎన్నికలు, అధికారాలు ఇతరత్ర దేశమంతా ఒకే విధంగా ఉండకపోయేది. కాని ఎప్పుడైతే 73, 74 రాజ్యాంగ సవరణలు అమలులోకి వచ్చాయో అప్పుడు ఐదు అంశాలు దేశమంతటా ఒకే విధంగా కొనసాగేలా పంచాయతీరాజ్ వ్యవస్థ తీర్చిదిద్దబడింది.

1. దేశమంతటా మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టడం
   ఎ) గ్రామపంచాయతీ బి) మధ్యంతర వ్యవస్థ (సమితి, మండలాలు) సి) జిల్లా పరిషత్
2. ఐదేళ్ళకోసారి క్రమం తప్పకుండా ఎన్నికలు
3. ఎన్నికలు జరిపించడానికి రాష్ట్రాల్లో స్వతంత్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటు.
4. దేశంలో ప్రణాళిక సంఘం, ఆర్థిక సంఘం లాగా రాష్ట్రాలకు స్వతంత్ర ఆర్థిక సంఘం ఏర్పాటు.
5. దేశవ్యాప్తంగా పంచాయతీరాజ్ వ్యవస్థలోని మూడంచెలలో అన్ని పదవులలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం.

ప్రధానంగా ఈ రాజ్యాంగ సవరణల్లో చోటు చేసుకున్న అంశాలు. అలాగే గ్రామసభ గ్రామ పార్లమెంటుకు సమానంగా అభివృద్ధి నమూనాను రూపొందించడం ద్వారా పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచడం ఈ సవరణ ముఖ్య ఉద్దేశం.

ఈ రాజ్యాంగ సవరణ ద్వారా దేశమంతటా మూడంచెల విధానం, స్త్రీలకు రిజర్వేషన్లు, ఎన్నికల కమిషన్, ఆర్థిక కమిషన్

లాంటివి ఏర్పడ్డా కూడా చాలా రాష్ట్రాల్లో ఇప్పటికీ ఐదేళ్ళకోసారి తప్పనిసరి ఎన్నికలు జరపకపోవడం, రాష్ట్రాల్లో స్వతంత్ర ఆర్థిక సంఘం అవసరమైన సిఫార్సులు చేసినా రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకపోవడం, ఈ వ్యవస్థల్లో ప్రజల భాగస్వామ్యం పెంచకపోవడం లాంటివి జరగడం దురదృష్టకరం. అధికార వికేంద్రీకరణ అనగానే పైన కేంద్ర ప్రభుత్వం, మధ్యన రాష్ట్రప్రభుత్వం చివరికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఇలా ఒక మ్యాప్ (పటం) మన కళ్ళల్లో మెదలుతుంది. కాని మన అధికార వికేంద్రీకరణ సూత్రం ఇది కాదు. రాజ్యాంగంలో కూడా జాతీయ ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఎలా అధికారాలు ఉంటాయో అలాగే 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు కూడా 29 అంశాలలో అధికారాలు, మున్సిపాలిటీలలో 18 అంశాలలో అధికారాలు ఇవ్వాల్సివుంది. రాజ్యాంగ సవరణ జరిగి 18 సం॥ అవుతున్నా ఇప్పటికీ దేశంలోని చాలా రాష్ట్రాలు ఈ అధికారాలను బదలాయించలేదు. అదీకాకుండా అధికారం అంటే అసలైన నిర్వచనం, సరయిన స్పష్టత కానీ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకి ఈనాటికీ లేకపోవడం విచారకరం. అధికారం అంటే విధులు, (ఫంక్షన్స్) నిధులు (ఫండ్స్), సిబ్బంది (ఫంక్షనరీస్) కేటాయించినప్పుడే నిజమైన అధికారాన్ని పంపిణీ చేసినట్లు లెక్క. దీన్నే 'మూడు ఎఫ్'ల సిద్దాంతం అంటారు. ఈ మూడు అప్పజెప్పనిదే అసలైన అధికారం ఇచ్చినట్లు కాదు.

ఇక వీటన్నింటికి అతీతంగా నిజమైన అధికార వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని దేశంలో మొట్టమొదటిసారి ప్రతిపాదిస్తున్న పార్టీ లోక్‌సత్తా. 'జిహ్వకో రుచి పుర్రెకో బుద్ధి' అనేది సామెత. అంటే వ్యక్తిగా మనకి ఇష్టమైన పదార్థాన్ని మిగతావారి ఇష్టాఇష్టాలతో పనిలేకుండా మనం తినవచ్చు. అదే మన అమ్మాయి పెళ్ళి విషయానికి వస్తే మనం ఒక్కరమే నిర్ణయం తీసుకోలేం. అమ్మాయి ఇష్టాఇష్టాలు తెలుసుకోవాలి. కుటుంబ సభ్యులు ఇతర దగ్గరి బంధువుల అభిప్రాయాలు కూడా తెలుసుకోవాల్సి వుంటుంది. ఇదే వ్యక్తికి, కుటుంబానికి ఉన్న తేడా. మన ఊళ్ళో చెరువు ఉందనుకోండి, చెరువు ఊరుమ్మడి ఆస్తి. కాని ఆ చెరువు ద్వారా సాగు చేసుకునే రైతులకి ఆ చెరువులో నీళ్ళు వాడుకునే అధికారం ఉండాలి. దీన్నే 'స్టేక్‌హోల్డర్స్ ఎంపవర్‌మెంట్' అంటారు.

అలాగే మన పిల్లల కోసం ఒక ఆసుపత్రినో, ఒక పాఠశాలనో, ఒక రోడ్డునో సొంతంగా నిర్మించుకోలేం. ఇది సమాజం చేయాల్సిన పని. ఉదాహరణకి ఒక రోడ్డు తీసుకుంటే గ్రామంలో రోడ్డు వేయాలంటే ఆ పని పంచాయతీ చేయాలి. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి రోడ్డు వేయాలంటే ఆ పని మండలంలోని పాలక వర్గం చేయాలి. అలాగే ఒక మండలం నుంచి మరో మండలానికి రోడ్డు వేయాలంటే ఆ పని జిల్లా పరిషత్ చేయాలి. అలాగే ఒక జిల్లా నుంచి మరో జిల్లాకి రోడ్డు వేయాలంటే రాష్ట్రప్రభుత్వం, రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి రోడ్డు వేయాలంటే జాతీయ రహదారుల విభాగం ఆ పని చేయాలి. ఇలా పని ఒకటే అయినా పరిధి మారినకొద్దీ ప్రభుత్వాలు మారుతున్నాయి. దీన్నే వ్యక్తి నుంచి వ్యవస్థ వరకు జరిగే పనివిభజనగా చెప్పుకోవచ్చు. దీన్నే 'థియరీ ఆఫ్ సబ్సిడియారిటీ' అంటారు. పౌరుడు కేంద్రంగా పాలన సాగాలి అనేది దీని ముఖ్య ఉద్దేశం. అలాగే ప్రజల భాగస్వామ్యం పెరగడానికి కూడా ఈ సూత్రం పనిచేస్తుంది. దీన్నే అచ్చతెలుగులో చెప్పాలంటే.. పౌరకేంద్ర సిద్ధాంతంగా అభివర్ణించవచ్చు. ప్రపంచంలో ఒకటి రెండు దేశాల్లో ఈ సూత్రంతో ప్రభుత్వాలు నడుస్తున్నాయి. మన దేశంలో ఈ సిద్ధాంతాన్ని గత పన్నెండేళ్ళుగా లోక్‌సత్తా ప్రచారం చేస్తోంది. దీని ద్వారా నిజమైన అధికార వికేంద్రీకరణ జరుగుతుందనేది లోక్‌సత్తా ప్రగాఢవిశ్వాసం.




1. పౌరుడు
2. కుటుంబం
3. స్టేక్ హోల్డర్స్
4. గ్రామ పంచాయతీ/ మున్సిపాలిటీ
5. మండల పరిషత్
6. జిల్లా పరిషత్
7. రాష్ట్ర ప్రభుత్వం
8. జాతీయ ప్రభుత్వం

# యువత యువశక్తి కలిస్తే..



ఎ. అన్నపూర్ణ

*యువత తమ శక్తే ఆయుధంగా వ్యవస్థను మార్చడానికి కారణం అవుతుంది. ప్రతి మనిషి యువతరంలో ఒకడిగా వుంటాడు ఇప్పుడు మనం చూస్తున్న విషయాలు అంతకు ముందు జరిగినవే. అయితే మరో రకంగా! ఐదేళ్ళక్రితం ఏ విధంగా విప్లవాన్ని సృష్టించగలరో అని ఆలోచించేవారు. సాధారణంగా ఈ ఆలోచన ఎలక్షన్ల ముందు వస్తుంది. ప్రతీ ఎలక్షన్స్ టైమ్‌కే నవయువత ఓటు వేసే వారుగా నమోదు అవుతారు కనుక! పార్టీల వారీగా, అభ్యర్థులవారీగా దృష్టి అంతా యువతవైపే దృష్టి సారించి వుంటారు. ఈ విధంగా యువత ఎప్పటికప్పుడు ప్రభుత్వం నెలకొల్పే విషయంలో ప్రాముఖ్యత వహిస్తారు. కానీ అవసరానికి వారిని వాడుకుని వదిలివేయడం మంచిదికాదు. అలా అని యువత మీద అనేక బాధ్యతలను, ఒత్తిళ్ళనూ మోపడం సరికాదు.*

**ఈ** 2009వ సంవత్సరంలో పార్లమెంటుకు ఇదివరకు ఎన్నడూలేనంత మంది 82 మంది యువ ఎంపిలు ఎన్నికయ్యారు. వీరంతా 25 నుండి 40 సం॥ వయసు గలవారే. వీరిలో పాలకవంశ వారసులు, వృత్తినిపుణులు, నాయకుల భార్యలు, సినీతారలు వున్నారు. అయితే యువకులు యువకులుగానే వుండిపోరు. మనదేశంలో యువత తమ ప్రభావాన్ని నిలబెట్టుకోగలరనీ, మార్పు తీసుకురాగల సత్తా వీరికే వుందని గట్టిగా నమ్మడానికి వీలులేకుండా పోయింది. ఎందుకంటే యువత ఎంత త్వరగా తన ఆశయాలను ఆచరణలో పెట్టాలనుకున్నా మార్పు తీసుకురాగల స్థాయికి చేరుకునే సరికి వారు యువదశను దాటిపోతారు. అంతేకాక యువకుల నించి ఆశించేది ఒక్కరికీ విడిగా కేటాయించేపనికాదు. చాలా మంది కలిసి చేయాల్సిన పనిగా వుంటుంది. అంటే మార్పు అనేది ఒక్కసారి యువత ప్రమేయంతోనే సాధ్యపడదు కదా! ప్రతీసారి వందలువేలూ కావాల్సివుంటుంది. వారిలో చైతన్యం ఎన్నడూ ఒకేలా ఉంటుందని ఆశించనూలేం. వారి ఆలోచనా సరళి, ఆవేశం, దీక్ష, పట్టుదల శాశ్వతంగా నిలబడతాయా? కాలక్రమాన మార్పులు జరుగుతాయా? భిన్నమనస్తత్వాలు భిన్నజాతులు మతం, భాష ఆర్థికపరంగానే కాకుండా లక్ష్యాలను చేరుకునే దిశగా వీరు చివరిదాకా నిలబడగలరా అనేదే సందేహం అయితే తగిన విధంగా తర్ఫీదునిస్తే నేటియువకులే రేపటి పౌరులుగా స్థిరపడగలరు.




రేపటి మత ఛాందసవాదులు, నైతిక విలువలను పాటించేవారు, అవినీతిమయ రాజకీయ నేతలు, దోచుకునే వ్యాపారవేత్తలు, లైంగిక వేధింపులకు పాల్పడేవారు హంతకులు కూడా యువతే! ఆవేశంలో యువత తిరగబడినా 'యువత్వం' నుంచి దాటి రాబోయే తరానికి శిక్షకులుగా మారితే జరగబోయే పరిణామాలు యధాతథమేకాదా? పాత్రధారులు మారవచ్చునేమో కానీ పాత్రలు మారవు.

వయసుమళ్ళిన వారి శక్తిని కూడా తక్కువ అంచనావేయాల్సిన పనిలేదు. వీరిలోనూ నూతనోత్తేజం, భావితరాల పట్ల నమ్మకం, మనసావాచా అంకితభావం, అనుభవసారాన్ని జోడించి తీసుకునే సరియైన నిర్ణయాలూ భవితను మంచివైపున నడిపించగలవు. కొన్ని విషయాల్లో పాతతరం కంటే కూడా నేటి యువతకు ప్రపంచం పట్ల ఎంతో అవగాహన వుంది. నేటి ఎలక్ట్రానిక్ గ్లోబలైజేషన్ యుగంలో పుట్టి పెరిగిన పిల్లలు కావడం వలన ఇప్పటి యువత వేరు ఆలోచనలతో వుండటం విశేషం. విదేశాలకు వెళ్ళి అక్కడ హాయిగా లైఫ్ ఎంజాయ్ చేయాలనే, చివరికి ఏ దేశంలో అయినా జీవితం ఒకటే అని నిర్ధారణ వచ్చే స్థితిలో లేరు. ఈ దేశంలోనూ అవకాశాలు వున్నాయనే మనస్ఫూర్తిగా నమ్ముతున్నారు. వెనుకటి తరాల వారికి అందుబాటులో లేని బ్రాడ్‌బ్యాండ్, పెద్ద పెద్ద బుక్‌షాప్స్, లెక్కలేనన్ని టీవిఛానల్స్ అందుబాటులో వున్నాయి. అంతేకాక వీటిని అందుకోగల అవకాశాలూ గ్రహించారు. ఆత్మవిశ్వాసం, ఖచ్చితమైన అభిప్రాయాలు వున్న తమ జీవితాన్ని నచ్చిన రీతిలో గడిపే అవకాశం, హక్కు వున్నాయని భావిస్తున్నారు. అలా అని ఇప్పుడు నలభై ఏభై సంవత్సరాల వారు ఆయువు తరిగిపోతోందని ఏ రోగాన బారిపడతామో అని భయపడరు. సరికదా రెండో యవ్వన ఘట్టాన్ని

ఆహ్వానిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా మనసులో ఉత్సాహం నింపుకుంటున్నారు. యువశక్తి అంటే కేవలం ముప్పైఏళ్ళ వరకే...అనుకునే నైరాశ్యం ఇప్పుడెవరిలోనూ లేదు. నిరాశా నిస్పృహలను తొలగించే పరిణామం ఇది. చాలామంది వయసుమీద పడినా ఉత్సాహంతో సాహసాలు చేస్తున్నారు. ఎన్నో బృహత్తర కార్యక్రమాలను జరిపిస్తూ నిండుజీవితాన్ని గడుపుతున్నారు. వీరంతా యువకులు కారు. యువశక్తి అనేది కేవలం వయసుకే పరిమితం కాదు. వారు యువకులు కాకపోవచ్చు. వయసురీత్యా ఉన్నత ఆశయాలూ ఆదర్శాలు ఉత్తేజం, ఉత్సాహం స్ఫూర్తి గలవారు. ఎవరిలో ఎప్పుడూ ఈ లక్షణాలు నిబిడీకృతమై వుంటాయో వారు యువజనులు. ఈ లక్షణాలు కలవారు ఎవరైనా భారతదేశాన్ని మరింత ముందుకు తీసుకుపోగల యోధులు. బ్రిటిష్ కాలం నాటి తుప్పుపట్టిన చట్టాలను దేశ కాలపరిస్థితులనూ మార్చివేయగల ఆలోచనాపరులు, వీరికి తోడు యువకులు కూడా కలసివస్తే రెండో స్వాతంత్ర్యం సాధించడం కష్టం కాదు. జనాభాలో 54శాతం 25 ఏళ్ళలోపు వయసువారే. అందుకే దేశం కళాశాలప్రాంగణంగా అలరారుతోంది. భారీసంఖ్యలో 10 కోట్ల మంది యువ ఓటర్లు 2009లో తొలిసారిగా ఓటువేశారు. 2004లో 35 సం॥ వయసు గల అనేకమంది రచయితలు రచనలు చేశారు. ఈ రకంగా భారతీయ సాహిత్యంలో సరికొత్త శకం ప్రారంభమైంది. యువత సమాచార సంబంధాలకు ప్రాధాన్యమిస్తోంది. నేటి సమాజం కౌమారం దశ వైపు పరుగుతీస్తోంది. ఒకప్పుడు ఏభై సంవత్సరాల వయసు వృద్ధాప్యం. కానీ నేడు ఆ వయసు 25 సం॥కి సమానం. ఆ విధంగా యువత యువశక్తి కలసి సాగుతున్నాయి. ఇది ఆనందకరమైన పరిణామం. యువశక్తిని నిలువునా కొత్తగా నింపుకుని ఆశయసాధనకు ఉవ్విళ్ళూరుతుంటే యువకులు తమ అడుగులు కలిపి అనుసరించడం శుభపరిణామం. యువతలో క్షణికావేశం, ఆశయమనే తొందరపాటు, శృతిమించని ఆలోచనాసరళికి పగ్గాలు వేస్తూ సరియైన శిక్షణ నిస్తే మంచి భారత పౌరులుగా రూపుదిద్దుకోడంలో ఎలాంటి సందేహమూ వుండదు. మధ్యవయసువారికి నైరాశ్యమూ ఉండదు. కష్టించి పనిచేసే వారినీ నూతనాశయాలతో ముందుకు వచ్చేవారినీ అర్థం చేసుకుని తగిన సహాయసహకారాలను అందచేసినపుడు యువశక్తికి తిరుగులేదు. ప్రోత్సహించినపుడూ విజయానికి ఢోకాలేదు. ఈప్రయత్నంలో సఫలం అవుదాం. కాలం మారింది ఆలోచనలు మారాయి. ఏదో సాధించి తీరాలి. అనే తపనతో యువశక్తిని సాధించి మందిని కూడగట్టడం చూస్తున్నాం. 'మకిలిపట్టిన రాజకీయం' అనే అర్థాన్ని రూపుమాపడానికి వీరంతా కృతనిశ్చయంతో వున్నారు. అందుకే ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా ఆశయం సిద్ధించగలదనే ఆశ కలుగుతోంది. ■

## నాణ్యమైన విద్య కోసం ఉద్యమాలు చేయాలి - లోక్‌సత్తా

రాష్ట్రంలో ఈరోజు పోటాపోటీగా ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీలు... జనజీవితాన్ని గణనీయంగా అభివృద్ధి చేయగల విద్యారంగంలో మార్పుల పట్ల మాత్రం పూర్తిగా కళ్లు మూసుకున్నాయి. రాష్ట్రంలో పాఠశాలల పరిస్థితిపై రాజీవ్ విద్యామిషన్ అధ్యయనమే అందుకు నిదర్శనం. ప్రజల మధ్య చిచ్చుపెట్టి కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజల ద్వేషాల్ని పెంచి ఓట్లు దండుకుంటూ ప్రజల్ని శాశ్వతంగా యాచకుల్లా కొనసాగించటమే ఆ పార్టీల లక్ష్యం. అందుకే అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే విద్యను ఉద్దేశపూర్వకంగా అణగదొక్కుతూ వచ్చారు. 64,869 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కేవలం 261 పాఠశాలల్లో పిల్లలు మాత్రమే సరిగ్గా పాఠాలు చదవగల, రాయగల స్థితిలో ఉన్నారని, అలాంటి స్థితిలో ఉన్న పాఠశాలలు కనీసం పట్టుమని పది కూడా లేని జిల్లాలు రాష్ట్రంలో 14 వరకూ ఉన్నాయని రాజీవ్ మిషన్ అధ్యయనం పేర్కొంది. ఇన్నాళ్లూ రాష్ట్రాన్ని పాలించిన పార్టీలు చేసిన నేరసమాన నిర్లక్ష్యమే ఇది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థి పేరు మీద ప్రభుత్వం ఏటా సుమారు రూ.10,000 ఖర్చుచేస్తున్నా ఫలితాలు నాసిరకంగా ఉన్నాయంటే పాలకులు ఆ కీలకరంగం పట్ల ఎంత దోపిడీధోరణితో, దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారో బోధపడుతుంది.

మనకంటే వెనకబడిన రాష్ట్రాల్లో విద్యాప్రమాణాలు పెరుగుతుంటే మనరాష్ట్రంలో మాత్రం ఉన్నకొలదీ వెనకపట్టు పడుతోంది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అప్పులు చేసి మరీ పిల్లల్ని ప్రైవేటు స్కూళ్లలో చేర్చే వారి సంఖ్య ఏటా 37.5శాతం మేర పెరుగుతోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు పార్టీలన్నీ నడుంబిగించాలి. ప్రజలకు మేలు చేయాలని ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఉద్యమాలు చేయవలసిన అసలైన రంగాలు విద్య, ఆరోగ్యం వంటి మౌలిక అంశాలు. ప్రభుత్వ- ప్రైవేటు తేడా లేకుండా అందరికీ నాణ్యమైన విద్యను ఉచితంగా అందించేందుకు పార్టీలన్నీ కలిసివచ్చి రాజకీయానికి విద్యను కేంద్రబిందువు చేయాలి.

# ప్రజలే ప్రభువులు పాలకులు సేవకులే



ఈద చెన్నయ్య

**భా**రతదేశం స్వాతంత్ర్యానంతరం మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఐదేళ్ళకొకసారి చట్టసభలకు, స్థానికసంస్థలకు ఎన్నికలు వస్తున్నాయి. జాతీయ ప్రాంతీయ పార్టీలు తమ అభ్యర్థులను నామినేషన్ పద్ధతిలో ఎన్నికల బరిలో నిలబెడుతున్నాయి. పేద ప్రజలు ఆనాడు - ఈనాడు ఓటు వేస్తూ వస్తున్నారు. పేద ప్రజలకు మన రాజ్యాంగం హక్కులు కల్పించిందని కానీ ప్రజా ప్రతినిధులు మన కొరకు పనిచేస్తారని కాని తెలిసేది కాదు. కొందరు విద్యావంతులు, మేధావులు మన ప్రజాస్వామ్యం గురించి తెలిసినా ఈ రాజకీయాలకు మనకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. అందుకే పాతతరం రాజకీయాలు కొందరి చెప్పుచేతల్లో, పెత్తందార్ల కనుసన్నల్లో కొనసాగాయి. భూస్వాములు, పెట్టుబడిదారులు, వ్యాపారులు, రౌడీలు ఇపుడు భూకబ్జాదారులు రాజకీయాల్లో ప్రవేశించారు. ప్రజాప్రతినిధులుగా అప్రజాస్వామికంగా, ఎన్నికల సంఘాన్ని, ప్రక్రియను అపహాస్యం చేస్తూ ఓటుకు నోటు, మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంచి ఎన్నికైన వారే రాజకీయ నాయకులుగా చెలామణి అవుతున్నారు.

> **కులం పునాదులపై ఒక జాతిని కానీ, నీతిని కానీ నిర్మించలేరు!!**
>
> **-బాబా సాహెబ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్**

అచేతన స్థితిలో ఉన్న ప్రజల అమాయకత్వం, అజ్ఞానాన్ని బలహీనతలను ఆసరా చేసుకుని అధికారం చేజిక్కించుకోవాలని, రాజకీయాల వెనుక దేశ సంపదను కొల్లకొట్టడానికి, రాజకీయ రంగంలో ప్రవేశించి తమ గుత్తాధిపత్యాన్ని వంశపారపర్యంగా కొనసాగిస్తున్నారు.

అసలు మనకంటూ ఒక ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ ఉందనీ ఎన్నికలు నిర్వహించడానికి ఒక కమిషన్ (స్వతంత్ర ప్రతిపత్తి గల) ఉందనీ, ఓటు వేయడానికి ఓటరుకు స్వేచ్ఛ వుందని శ్రీ టి.యన్. శేషన్ వచ్చాక సాధారణ పౌరునికీ అర్థమయింది. కాలక్రమంలో రాజకీయ పార్టీలు ఓటర్లలో వచ్చిన చైతన్యాన్ని పసికట్టి ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు అధికారమే లక్ష్యంగా రిగ్గింగులు, బ్యాలెట్ బాక్స్‌లు ఎత్తుకుపోవడం, ప్రత్యర్థులను ఓడించేందుకు కుట్రలు, కుతంత్రాలు పన్నేవారు. రాజకీయ పార్టీలు కుల, మత, ప్రాంతీయ ప్రాతిపదికన, సందర్భాన్ని బట్టి పుట్టుకొచ్చాయి. తమ వ్యూహాన్ని మారుస్తూ వచ్చాయి. ఇపుడు దేశంలో ప్రజలు వర్గాలు, కులాలుగా విడిపోయి అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి పరుగులు తీస్తున్నారు. ఇదంతా పేద ప్రజలను ఉద్ధరించడానికి కాదు. అభివృద్ధి చెందిన సమాజం రాజకీయాలకు దూరంగా వుంటూ ఎన్నికలే ఒక బూటకం అని, మన ప్రజాస్వామ్య వ్యవస్థ, చట్టాలు లోపభూయిష్టమని ఎన్నికలకు దూరంగా వుంటున్నారు. కారణం రాజకీయ పార్టీలు, నాయకులు పట్ల విశ్వాసం లేకపోవడం.

ప్రస్తుత రాజకీయాలు పరిశీలించినట్లయితే సామాజిక కార్యకర్తలు, మంచివారు రాజకీయాల్లోకి ప్రవేశించే అవకాశం వుందని సామాన్య జనాన్ని రాకుండా, ధనవంతులకే పార్టీ పదవులు కట్టబెడుతూ వస్తున్నారు. పేద ప్రజలు పాలకులు అయ్యే అవకాశం కోల్పోయి ఓట్లు వేసే ఓటు బ్యాంకుగా మారిపోతున్నారు.

రెండు దశాబ్దాల కాలం నుండి దేశంలో కొత్త వరవడితో రాజకీయ పార్టీలు మరోసారి ప్రజల ముందుకు వచ్చాయి. ప్రజల కొరకే ప్రజాస్వామ్యమని, ఓటర్లు దేవుళ్ళు ప్రజల ఆకాంక్షల మేరకే నడచుకుంటామని నమ్మబలుకుతూ మోసకారితనాన్ని ప్రదర్శిస్తున్నారు. మతం ఆధారంగా, కులం ఆధారంగా రాజకీయం చేస్తూ ఎవరి సామాజిక వర్గం ఎక్కువుంటే వారు ఏ రాజకీయ పార్టీ అయినా పెట్టవచ్చు. ఓ పార్టీ అధినేత మా కులం వాడయితే, ఆ కులం వారు పెట్టుబడులు పెట్టి మరల అధికారం రాగానే కోట్లు గడించడానికి, పదవులు, అయినవారికి కాంట్రాక్టులు ఇచ్చి దండుకునే అవినీతి రాజకీయాలకు బాటలు వేస్తున్నారు. ఇప్పుడు రాజకీయ పార్టీలు కులాలు, కుటుంబాలుగా విడిపోయి ఆయా సామాజిక వర్గాలకు

చెందిన క్రీడగా మారాయి. గెలుపు ఎవరిదైనా దోపిడీని కేంద్రంగా చేసుకొని, అవినీతిపరులమయం చేసింది.

విభిన్న పద్ధతిలో ఓటుకు నోటు, మద్యం, కులాల వారీగా, గ్రామాల వారీగా సెటిల్‌మెంట్లు చేస్తూ దోపిడీలో అందరినీ భాగస్వాములను చేస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా సీట్లు కేటాయించేటప్పుడు కోట్లు ఉన్న వాడికే టికెట్టు - ఏ కులం, ఏ నియోజకవర్గంలో ఎక్కువుంది, గెలుపు ఓటములు శాసించే కులాలు ఎవరు? వారికి ఎటువంటి హామీలు ఇవ్వాలి? ఎన్ని కోట్లు ఖర్చుపెట్టి ఓట్లు కొనాలి అనే ఆలోచనలోపడ్డాయి. ముందుగా ఎన్నికల గంటమోగగానే నగరాల్లో బస్తీలను, గ్రామాల్లో పేద ప్రజలైన బిసి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీల బలహీనతలు వీటిని సమర్ధవంతంగా ఎదుర్కోగల నాయకుడు ఎవరు అనే కోణంలో అభ్యర్ధుల వేట ప్రారంభిస్తారు.

మన ప్రజాస్వామ్యంలో ఏనాడూ ప్రజల జీవన విధానాన్ని మనోభావాలను, ఆకాంక్షలను మన పాలకులు, నాయకులు గౌరవించకుండా కేవలం ఓట్లు వేసే వారుగా చేసి ఐదేళ్ళ కొకసారి అధికార మార్పిడి కోసం కుట్రలు, కుతంత్రాలతో ఒక దిశా నిర్ధేశం లేని రాజకీయాలను చేస్తున్నారు. అందుకే సమాజంలో ఉన్న 90 శాతం మంది మంచివారు రాజకీయాలకు దూరంగా వుంటున్నారనే సత్యాన్ని మనం గ్రహించాలి. దోపిడీ, అవినీతి పోవాలంటే అవినీతి పరులను రాజకీయాల్లోకి రానివ్వకూడదు. రాజకీయ పార్టీలు, నాయకులు మారనిదే అవినీతి పోదు. ప్రజల చుట్టూ తిరిగే జన రాజకీయం రానిదే ప్రజాస్వామ్యంలో ప్రజలకు విలువ వుండదు. ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలంటే నూతన రాజకీయాలను ఆహ్వానించాలి. అప్పుడే మార్పు సాధ్యం. అందరూ ఎదగడానికి సమాన అవకాశాలు రావాలి. వివక్ష పోవాలంటే దీనికి కావలసిన మౌలిక మార్పులు మన వ్యవస్థలో రావాలి. వ్యవస్థీకృత సంస్కరణలు, లోపభూయిష్టమైన చట్టాలు, అధికార వికేంద్రీకరణ జరగకుండా మనం మంచి రాజకీయాన్ని, నాయకత్వాన్ని ఈ దేశానికి అందించలేము.

మొన్న జరిగిన జిహెచ్ఎమ్‌సి ఎన్నికలు కానీ, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు కానివ్వండి పోలింగు సరళిని పరిశీలించినట్లయితే 40-60 శాతం మాత్రమే నమోదు అయ్యింది. ఎక్కువ శాతం పేదప్రజలే, నిరక్షరాస్యులే స్వచ్ఛందంగా పోలింగు స్టేషన్‌కు తరలి వెళ్ళి ఓటు వేస్తున్నారు. విద్యావంతులు, సంపన్నులు ఎన్నికలకు దూరంగా వుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. కారణాలు ఏవైనా కావచ్చు.

ఎందుకంటే ప్రజల అనుభవంలో రాజకీయ పార్టీ నాయకులు ఓటరును ఏనాడు గౌరవించలేదు. మీరు ఓటుకు అమ్ముడుపోవద్దు. బిచ్చగాళ్ళలా మారొద్దు అంటూ, చదువుకున్న విద్యావంతులు చైతన్యవంతులై ఓటు వేస్తున్నారు. పేద ప్రజలైన మీరే ఇలా చేస్తున్నారని అంటుంటారు. కానీ పోలింగురోజు మాత్రం ఓటు వేయడానికి వచ్చేది ఈ పేద ప్రజలే - ఎవరిది తప్పు? తేల్చవలసింది కాలమే. ■

## ఆర్టీసీ ఛార్జీల పెంపు ప్రజారవాణా వ్యవస్థను మరింత దెబ్బతీసేలా ఉంది - లోక్‌సత్తా

పట్టణ ప్రాంతాలవారితోపాటు పల్లెప్రజలకు కూడా భారంగా మారిన ఆర్టీసీ ఛార్జీల పెంపు పాపానికి ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలోని చాలా రాజకీయ పార్టీలు కూడా బాధ్యత వహించాలి. ఉద్యమాల పేరుతో బంద్‌లు, రాస్తారోకోలతోపాటు బస్సుల్ని ధ్వంసం చేయటం వల్ల చివరకు ఛార్జీలు పెంచాల్సిన పరిస్థితి వచ్చి సామాన్యప్రజలే నలిగిపోతున్నారు. పోటాపోటీ విధ్వంసాలకు పాల్పడి ఇప్పుడొచ్చి ఆర్టీసీ ఛార్జీలు తగ్గించాలని మళ్లీ ఆందోళనలకు దిగటం ఆయా పార్టీల దగాకోరు వైఖరికి అద్దంపడుతోంది. బంద్‌లు, రాస్తారోకోలు, విధ్వంసాల వల్ల సామాన్యులే నష్టపోతారన్న వాస్తవాన్ని గుర్తించి, ఇప్పటికైనా ఆందోళనలకు, నిరసన వ్యక్తీకరణకు ప్రత్యామ్నాయ పద్ధతుల్ని రూపొందించుకోవాల్సిన అవసరముంది. ఇందుకోసం పార్టీలన్నీ కలిసి చర్చించుకుని ఒక అంగీకారానికి రావాలి.

మరోవైపు, రాష్ట్రంలో ఆర్‌టీసీ ఛార్జీల అసాధారణ పెంపు ప్రజారవాణా వ్యవస్థను బాగుచేసేరీతిలో కాకుండా మరింత సంక్షోభంలోకి నెట్టే రీతిలో ఉంది. పాలనాపరంగా అది పూర్తి బాధ్యతారాహిత్య నిర్ణయం. నగరాల్లో ఇప్పటికే జటిలంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించటానికి ప్రైవేటు వాహనాల వినియోగాన్ని తగ్గించాల్సి ఉంది. తన అనాలోచిత చర్యల ద్వారా ప్రైవేటు వాహనాల వినియోగాన్ని ప్రభుత్వమే పరోక్షంగా ప్రోత్సహిస్తోంది. దాంతోపాటు, ఛార్జీలు పెంచినతీరు పాలనారంగంలో నెలకొన్న అస్తవ్యస్తతను కళ్లకు కడుతోంది. ఆర్టీసీ ఎండీ తీసుకున్న నిర్ణయం ప్రభుత్వానికి తెలియదని రవాణాశాఖ మంత్రి చెప్పటం సర్కారు వైఫల్యాన్ని చెప్పకనే చెప్పుకోవటం. కుడిచేయి ఏం చేస్తోందో ఎడమ చేయికి తెలియకుండా సమన్వయలోపంతో పాలనావ్యవస్థ వ్యవహరించటం వల్ల చివరికి ప్రజలే బలిపశువులు కావలసి వస్తోంది. ప్రభుత్వం తక్షణం ఆర్టీసీ ఛార్జీల భారీ పెంపును వెనక్కితీసుకోవాలి. ఆదాయాన్ని పెంచుకునేందుకు సరకు రవాణాలో పన్నుల హేతుబద్ధీకరణ వంటి ప్రత్యామ్నాయ చర్యల్ని చేపట్టాలి.

# ప్రజాస్వామ్యం అంటే



**- అనుమోలు రాఘవయ్య**

## రాజకీయ పార్టీలకు సీట్లు - ప్రజలకు పాట్లా?

రాజ్యాంగం ద్వారా ఏర్పడిన అంశం శాసన, పరిపాలన, న్యాయవ్యవస్థలతో, పార్లమెంటరీ ప్రజాస్వామ్యమైన మనదేశంలో శాసన వ్యవస్థ చాలముఖ్యమైనది. మనదేశం భిన్న మతాలు, సంస్కృతులు కల్గి, భిన్న రాజుల పరిపాలన వ్యవస్థలచే పరిపాలింపబడిన భిన్న ప్రాంతాల కలయిక. దీనిని దృష్టిలో ఉంచుకొని, మన రాజ్యాంగ నిపుణులు అన్ని మతాల సౌభ్రాతృత్వం, సంస్కృతులను గౌరవిస్తూ అన్ని ప్రాంతాల ప్రజలు వారి ప్రాంతాల సమస్యలను తమ తమ ప్రాంతాల ప్రతినిధులను చట్ట సభలను ప్రజాస్వామ్య పద్ధతులలో ఎన్నుకొని, తద్వారా వారి పరిపాలన వారు చేసుకొనే వీలు కల్పించారు. ఇందులో భాగమే స్థానిక ప్రభుత్వాలు.

ప్రజల దైనందిన జీవనంతో సంబంధం ఉన్న విషయాలను అంటే విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, రవాణా మొదలైనవి స్థానిక ప్రభుత్వాల పరిధిలో ఉంచి, దేశ రక్షణ, శాంతి భద్రతలు లాంటి ముఖ్యమైన విషయాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించబడ్డాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చిన ఆదాయంలో స్థానిక ప్రభుత్వాలకు వాటి నిధులను ఇవ్వవలసి ఉన్నది. దురదృష్టవశాత్తు 73, 74 రాజ్యాంగ సవరణ జరిగిన తరువాత గత 60 సం॥ల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడిపిన సంప్రదాయ రాజకీయ పార్టీలు, స్థానిక ప్రభుత్వాలకు నిధులు చేకూర్చకుండా స్థానిక ప్రభుత్వాల పరిధిలోని అంశాలపై కూడా అజమాయిషీ చెలాయిస్తూ వచ్చాయి. దానివలన అధికారం కేంద్రీకృతమై ప్రజలు తమ దైనందిన అవసరాలకు కూడ ప్రభుత్వాలపై ఆధారపడి తమ ప్రతినిధుల చుట్టూ తిరుగుతూ యాచకులుగా మారవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ప్రజల అవసరాల నిమిత్తం ప్రభుత్వం పెట్టే ఖర్చును ప్రజల అవసరాలకు సంబంధం లేకుండా, సంప్రదాయ రాజకీయ పార్టీల పుణ్యమా అని చట్ట సభలు రాజకీయ వ్యాపార ప్రతినిధుల సభలుగా మార్చబడ్డాయి. ఎన్నికలలో ఆ పార్టీలు కోట్లు ఖర్చుపెడుతున్నాయి. అంటే ప్రభుత్వాలు ఖర్చు పెట్టే ప్రజాధనంపై పెత్తనం కొరకే అన్నది జగమెరిగిన సత్యం. ఇటీవల దీనిని మనము ప్రత్యక్షంగా చూశాం. దివంగత నేత స్వర్గీయ డా॥ రాజశేఖర రెడ్డి మరణాంతరం మన రాష్ట్రం, లో మన పొరుగు రాష్ట్రమైన కర్నాటకలో ప్రభుత్వ అస్థిరతకు జరిగిన రాజకీయ ఉదాంతాలు తార్కాణం. రాజకీయం మాటున సంపాదించిన ధనంతో కొంతమంది వ్యక్తులు ప్రభుత్వాలను శాసించే పరిస్థితులు ఏర్పడ్డాయి. అంటే ఆ వ్యక్తులకు మద్దతిస్తున్న ప్రజా ప్రతినిధుల సంఖ్య ప్రభుత్వాలను నడుపుటకు రాజకీయ పార్టీలకు అవసరమైన సంఖ్యను ప్రభావితం చేస్తున్నది. కాబట్టి ఈ దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయి. దురదృష్టవశాత్తు ప్రచార సాధనాలు కూడా ఈ సీట్ల రాజకీయ క్రీడనే ప్రజల మనస్సులోకి చొప్పిస్తున్నాయి. ఈవిధంగా ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే ప్రజలు తమను తాము పరిపాలించుకోవటము తప్పుదారి పట్టి, రాజకీయ పార్టీలు అధికారము పొందుట నిలుపుకొనుటకు అవసరమైన సీట్ల క్రీడగా మారినది. దీని ఫలితమే ప్రస్తుత రాష్ట్ర పరిణామాలు.

పై పరిస్థితులు ప్రతి ఒక్కరికీ విదితమే. అందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బాధితులే! మార్పును కోరుకొనేవారే. కాని దురదష్టవశాత్తు సంప్రదాయ రాజకీయ పార్టీలు నడుపుతున్న సీట్ల గారడీకి మోసపోతూ ఎన్నికల్లో మంచి పార్టీలకు ఓటు వేస్తే వృధా అని కొంతమంది, రాజకీయాలను విమర్శిస్తూ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించకుండా తమ బాధ్యతను మరచి కొంతమంది, ఈ సీట్ల రాజకీయానికి అవకాశమిస్తున్నారు.

సీట్ల రాజకీయానికి చరమగీతం పాడదాం. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడదాం ఇది మన అందరి గురుతర బాధ్యత.■

### మీడియా నియంత్రణకు జాతీయస్థాయిలో

# స్వయంప్రతిపత్తి గల యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి

వ్యక్తి స్వాతంత్ర్యాన్ని మించిన స్వేచ్ఛ మీడియాకు ఉండదు, వాక్‌స్వాతంత్ర్యాన్ని కల్పిస్తున్న రాజ్యాంగంలోని 19 (1) (ఎ) అధికరణం కిందే పత్రికాస్వేచ్ఛ కూడా ఉంటుంది. కాబట్టి మీడియా కూడా బాధ్యతాయుతమైన పౌరుడిలా వ్యవహరించి సమాజహితానికి కృషి చేయాలి. వైఎస్ హత్యకు రిలయన్స్ సంస్థ కుట్ర అనే వార్తను కొన్ని ఛానళ్లు పదేపదే ప్రసారం చేయటం, అది చూసి 7వతేదీ రాత్రి రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసాలు జరగటం మీడియా తన పరిధిని ఉల్లంఘించటమే.

మీడియాకు స్వీయనియంత్రణ ఉండాలన్న మాటలు చాలవని ఈ ఉదంతం తాజాగా మరోమారు రుజువు చేసింది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా అదుపుతప్పే రీతిలో వెళ్తోంది. రేటింగ్స్ కోసం యుద్ధంలో ఏదోకరూపంలో ప్రజల్ని ఆకట్టుకోవాలన్న ధోరణితో బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోంది. రెచ్చగొట్టే, నిరాధార వార్తలను ప్రసారం చేస్తున్న టీవీ ఛానల్స్‌ను మూసివేస్తే రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం కొంత సమసిపోతుందన్న భావన ప్రజల్లో పాతుకుపోతోంది. రాజకీయానికి, మీడియాకి మధ్య తేడాలేకుండా పోవటం, రాజకీయాన్ని మీడియా శాసించటం, మీడియాని రాజకీయం శాసించటం అలాంటి ప్రమాదకర ధోరణులకు దారితీస్తోంది. దాంతోపాటు అడ్డదారుల్లో వేలకోట్లు దండుకోవటానికి, దండుకున్న డబ్బుతో రాజకీయాల్లో ఎదగటానికి మీడియాను ఓ ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. డబ్బుశక్తికి- మీడియాకు మధ్య తేడా లేకుండా పోయింది. మరోవైపు, వార్తాఛానళ్లు మరీ ఎక్కువైపోవటంతో మనుగడ కోసం విలువలకు తిలోదకాలిచ్చి కనీస వాస్తవాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా ప్రసారం చేసేస్తున్నారు. వ్యక్తిగతంగా చాలామంది జర్నలిస్టులకు విజ్ఞత ఉన్నా, వారు కూడా ఆ వ్యవస్థలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడింది.

> **మీడియాకు విశ్వసనీయత, జవాబుదారీ తనం, బాధ్యత తప్పని సరిగా ఉండాల్సిన లక్షణాలు. సమాజ అవసరాలు, రాజ్యాంగ విలువలు ప్రాతిపదికన వార్తల్ని, కార్యక్రమాల్ని అందించాలి.**

మీడియాకు విశ్వసనీయత, జవాబుదారీతనం, బాధ్యత తప్పనిసరిగా ఉండాల్సిన లక్షణాలు. సమాజ అవసరాలు, రాజ్యాంగ విలువలు ప్రాతిపదికన వార్తల్ని, కార్యక్రమాల్ని అందించాలి. వైఎస్ హత్యకు కుట్ర జరిగిందనుకుంటున్నారా, లేదా అని ఎస్.ఎం.ఎస్ పోల్స్ నిర్వహించటం బాధ్యతాయుత జర్నలిజం కాదు, కుట్ర అనుమానాలు సమగ్ర విచారణలో నిగ్గుతేలాల్సిన అంశాలు. వాస్తవాల్ని, ప్రజలకు ఉపయోగపడే అంశాల్ని ఆసక్తికరంగా, సృజనాత్మకంగా చూపించే కసరత్తు చేయగల శక్తిలేకే నాణ్యతారహిత జర్నలిజాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రజల పట్ల బాధ్యత లేకుండా ఏదిపడితే అది ప్రసారం చేయకూడదు. వాస్తవాల్ని ధృవీకరించుకోకుండా వార్తల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతారాహిత్యం ఎంతమాత్రం క్షమార్హం కాదు. "పనికిమాలినవాడు చెత్తాచెదారం మాట్లాడితే చూపటం, దానికి సమాధానమివ్వాలని ఇంకొకర్ని అడగటం, ఈరెంటినీ పదేపదే చూపి జనాన్ని వెర్రెక్కించటం వంటి కార్యక్రమాల్ని ఖచ్చితంగా మీడియా నియంత్రించుకోవాలి". అలాగే ఒక విషయం నిజమే అయినప్పటికీ పదేపదే ప్రసారాలు చేసి ప్రజల్లో ఉద్రేకాల్ని నింపకుండా మీడియానే బాధ్యత తీసుకోవాలి.

మీడియా బాధ్యతారహితంగా వ్యవహరించకుండా చూసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో దేశవ్యాప్తంగా ఆలోచన చేయాలి. ఇప్పుడున్న కేబుల్ చట్టాలను కఠినంగా అమలు చేయటంతోపాటు జాతీయ స్థాయిలో ఓ స్వయంప్రత్తి గల నియంత్రణా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. గీత దాటిన ఛానళ్లను ఆర్థికంగా శిక్ష విధించాలి. ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం త్వరితగతిన వ్యాపించి ఆర్థికంగా, ఇతర రూపాల్లో పెద్దఎత్తున ప్రభావం చూపుతుంది కాబట్టి శిక్షలు మరింత కఠినంగా ఉండాలి. రాజకీయపార్టీలు చేసే బంద్‌లు, రాస్తారోకోల వల్ల కలిగిన నష్టాన్ని వారి నుంచే వసూలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అదేరీతిలో ఛానళ్ల వల్ల కలిగిన నష్టాన్ని కూడా వారి నుంచే వసూలు చేయాలి. అలా అరుదుగానే అయినా కొన్ని ఛానళ్ల విషయంలో వ్యవహరిస్తే, కొంతమేరకైనా పెడధోరణుల్ని అరికట్టగలం. ■

# నాయకత్వమంటే.....?



చిట్టకవి వెంకటరమణ

నాయకత్వమంటే ఉమ్మడి ప్రయోజనాల కోసం నలుగురినీ ఉత్తేజపరచటం, నాయకత్వమంటే ఉత్సాహభరితంగా ముందుకు సాగటం, మిగతావారిని ప్రోత్సహించటం, నాయకత్వమంటే... సమస్యను ముందుండి ఎదురించటం, ఫలితాన్ని నలుగురికీ పంచటం.

నాయకత్వమంటే... ఆజ్ఞలు జారీచేయటం కాదు. నాయకత్వం అంటే అజమాయిషీ, కర్రపెత్తనం కాదు. దురదృష్టవశాత్తూ చాలామంది ఆ భ్రమలోను ఉన్నారు. దానికి కారణం చూసిన సినిమాలు, చదివిన పుస్తకాలు, విన్న విషయాలు కావచ్చు.

నాయకత్వమంటే ఒక హోదా కాదు. అది ఒక బాధ్యత.

ఈ సమాజంలో మంచిచెడుల మధ్య తారతమ్యం, న్యాయాన్యాయాల మధ్య వ్యత్యాసం, ధర్మాధర్మ విచక్షణ అందరికీ తెలుసు. మనలో చాలామంది అన్యాయం, అధర్మం రాజ్యమేలుతున్నప్పుడు మౌనంగా ఉంటారు. కొంతమంది చెడు వైపు ఆకర్షితులవుతారు. కానీ, మంచిని, న్యాయాన్ని, ధర్మాన్ని రక్షించటానికి నిలబడరు. కారణం... మానసిక దౌర్బల్యం. వారిని వారి మానసిక దౌర్బల్యం, పిరికితనం, చేతకానితనం, విధికి బందీ అయ్యే వారి ఆలోచనా విధానాన్ని నుండి బయటకు లాగి న్యాయాన్ని, ధర్మాన్ని, మంచిని రక్షించడానికి నిలబడేలా చేసే ప్రక్రియ నాయకత్వం. అలా చేయగలిగిన వాడే నిజమయిన నాయకుడు.

నేడు... మనదేశంలో అనేక సమస్యలు చెడ్డ రాజకీయం నుండి ఉద్భవించినవే. ఆ విషయం మనకందరికీ తెలుసు. ప్రస్తుత స్వార్థ, నేరమయ రాజకీయాల్ని, రాజకీయ నాయకుల్ని విమర్శించని వారు మనలో ఎవరూ లేరనేది అతిశయోక్తి కాదు. పుంఖానుపుంఖాలుగా విమర్శించి మానసిక సంతృప్తి పొందటం చాలా మంది చేసే పని కానీ, ఆ చెడ్డ రాజకీయాన్ని సంస్కరించాలనుకునే సంకల్పం ఉండి ఆ ప్రయత్నంలో మిగతా వారినందరినీ ఉత్సాహపరచి, ఉత్తేజపరిచి, భాగస్వాములను చేసేదే నాయకత్వం.

నాయకత్వం అనేది వారసత్వం కాదు. తండ్రి నాయకుడైతే.. కొడుకు నాయకుడవ్వాలని లేదు. అలాగే తండ్రి నాయకుడు కాకపోతే, కొడుకు నాయకుడు కాకూడదని లేదు. నాయకత్వం అనేది కుల, మత, ప్రాంత, భాషా, వయో, జ్ఞానం విషయాలకు సంబంధించినది కాదు. ప్రపంచ చరిత్రలో ఎంతోమంది నాయకులు అందించిన పటిష్టమైన నాయకత్వం వల్లనే... సమాజంలో ఎంతో పురోభివృద్ధి సాధించి ముందుకు సాగుతున్నాం. అలాంటి నాయకత్వం అందించే శక్తి సామర్థ్యాలు మనలో అందరికీ ఉన్నాయి. కావల్సిందల్లా ధైర్యంగా నిలబడడం బాధ్యత తీసుకోవడం, అన్యాయాన్ని ఎదురించటం, నిబద్ధతతో విలువల కోసం పోరాడటం. ■

**నిజమైన నాయకత్వం ప్రజల్ని ముందుకి నడిపించడంలో వుంటుంది తప్ప తాత్కాలిక ఉద్రేకాలకు లోనవడంలో వుండదు**

## పార్టీ జెండా చిహ్నం



1. పార్టీ జెండాయే పార్టీ లోగో (చిహ్నం)గా కూడా వుంటుంది.
2. లోగో ఏ సైజులో ఉన్నా వెడల్పు (ఎత్తు), పొడవుల నిష్పత్తి 2 : 3 ఉండాలి.
3. పార్టీ జెండా దీర్ఘచతురస్రాకారంలో, ముదురు నీలంరంగులో వుంటుంది. మధ్యలో తెల్లని వృత్తం వుంటుంది. ఆ వృత్తం మధ్యలో ఐదుకోణాల నక్షత్రం జెండా రంగులోనే వుంటుంది. పార్టీ జెండా అమరిక, కొలతలు, నిష్పత్తి, రంగులు నిబంధనల ప్రకారం వుండాలి.
4. అన్ని ప్రవాహాలను తనలో కలుపుకొనే మహాసాగరం స్వభావానికి, విస్తృతికి, లోతుకు ప్రతీకగా ముదురు నీలంరంగు వుంటుంది.
5. పార్టీ తాత్కాలికంగా వచ్చిపోయే మెరుపులకు కాక సుదూర లక్ష్యాల కాంతుల ప్రాతిపదికగా లక్ష్యసాధన క్రమాన్ని నిర్ణయించుకుంటుందని ఐదుకోణాల నక్షత్రం చెబుతోంది. నిజమైన ప్రజాస్వామ్యానికి మూలస్థంభాలైన స్వేచ్ఛ, స్వపరిపాలన, పౌరసాధికారత, చట్టబద్ధపాలన స్వయందిద్దుబాటు; ఈ ఐదింటికీ నక్షత్రంలోని ఐదుకోణాలు ప్రతీకలు.
6. పార్టీ చిహ్నంలోని తెల్లని వృత్తం స్వచ్ఛతకు ప్రతీక. మతం, ప్రాంతం, కులం, భాష, విశ్వాసాల భిన్నత్వంలోని ఏకత్వానికి ఈ తెలుపురంగు ప్రతీకగా వుంటుంది.

# ప్రక్షాళన

- చామర్తి మానస

కార్గిల్‌ను దాటి వచ్చి దేశమంతా శ్మశానం చేస్తున్న ఉగ్రవాదాన్ని
కళ్ళముందే కరుణ మరిచి కార్చిచ్చులు రేపుతున్న కులమతోన్మాదాన్ని
పిరికితనం పరదా చాటున ప్రతిఘటించక వదిలేయకుంటే
నా ప్రాణమెక్కడ ప్రతీకారానికి బలవుతుందోనని మధనపడే
నవతరపు ప్రతినిధిని నేను!

అసాంఘిక శక్తులకు, అవినీతికి - అణచివేతకు తలొంచక
విలువలకు నిలబడ్డవాడు నిలువెల్లా కాలిపోతుంటే
సామయందించడం కన్నా, సాక్ష్యంతో న్యాయం నిలబెట్టడం కన్నా
ఆత్మరక్షణే జీవిత లక్ష్యంగా భావించే
స్వతంత్ర భారత సగటు పౌరుణ్ణి నేను!

నా స్వార్థాన్ని పరికితనాన్నీ ఆసరాగా చేసుకుని
ఆకాశపు అంచుల దాకా పాకి కోటి పడగలు విప్పిన అన్యాయం
హఠాత్తుగా బుసలు కొడుతూ నాకేసే తిరిగినపుడు
కసిగా నన్ను కాటేసినప్పుడు....

వేనవేల ప్రాణ పత్రాలపై మృత్యు సంతకం లిఖించే రాక్షసత్వం
నా తోటివాళ్ళ కలలనీ, కన్నవాళ్ళనీ కళ్ళ ముందే కాల్చేస్తుంటే
ఎగసిపడుతున్న ఆవేశపు అలలను అప్పటికప్పడే అణగదొక్కి
మానవత్వపు తీరాల నుండి నేను మౌనంగా నిష్క్రమిస్తుంటే...

ఆ ఓటమిని విజయగర్వంతో తిలకించిన తీవ్రవాదం
ఈ ఉదయం నీవంతేనంటూ వాకిట్లోకొచ్చి
'నా' అన్న వాళ్ళందరినీ వెంటేసుకుపోతూ
ఒంటరైన నావైపు చూసి నిర్దయగా నవ్వినపుడు...
అప్పుడు... సరిగ్గా... అప్పుడు...

నిస్సహాయుడనై కుమిలిపోయినపుడు...
నిశ్శబ్దంగా నేను రోదించినపుడు
ఆసరా ఇచ్చే చేతి కోసం ఆశగా ఎదురు చూస్తున్నప్పుడు
నాలాగే స్వార్థంతో సంకోచించిన మనసులన్నీ
నిర్లిప్తంగా పక్కకు తప్పుకుపోతుంటే
వాళ్ళలో మెరుస్తున్న నా ప్రతిబింబాన్ని చూస్తూ
పశ్చాత్తాప పడడమే తప్ప నిందించలేనింక...!

ఏ బాధ్యతా లేని పౌరుల్లా
నిర్లజ్జగా ఓట్లన్నీ అమ్మేసుకున్నాక
ఖజానా కొల్లగొట్టే హక్కొక్కటే కొనుక్కున్న నేతలను
న్యాయం చేయరేమంటూ ఎలా నిలదీయగలనింక?!

అందుకే నా అంతర్నేత్రపు రెప్పలు మూసి ఈ దురవస్థనిచ్చిన
స్వప్న సందిగ్ధతను నేనే వదుల్చుకుంటున్నాను
స్థైర్యం ఒక్కటే సైన్యంగా మారిప వేళ
నన్ను నిర్బంధించిన శృంఖలాలేవో తెంచుకుంటున్నాను!

రాలిపడే ప్రతీ కన్నీటి చుక్కా
ఖడ్గంగా మారి తోడొస్తానంటుంటే
ఎగసెగసిపడుతున్న ఆవేశమంతా
అగ్నిపర్వతమై బద్ధలవుతుంటే...

అన్యాయానికి అవినీతికి
ఎదురుపడ్డ ప్రతీ ఉన్మాదానికీ
హింసకి స్వార్థానికి
రాక్షసత్వం పెంచి పోషించే రాజకీయాలకీ
చరమగీతం పాడేందుకు పల్లవి రచిస్తాను
అధర్మం రూపుమాపే ప్రక్షాళన ప్రారంభిస్తాను!!

శతాబ్దాల బానిసత్వపు చరిత్ర తిరగరాసేందుకు
మరో మారెవ్వరికీ అవకాశం రాకుండా ఆపేందుకు
నెత్తురోడుతున్న శాంతి కపోతానికి సమైక్యతా సంజీవని అందించి
సజీవంగా మరో తరానికి అప్పజెప్పేందుకు
మనసు మనసునీ కప్పేసిన అవివేకపు పొరలు చీల్చుకుని
ఒకరికొకరు తోడుండాలనే స్ఫూర్తి నిండాలని మొదలెట్టే
మహాయజ్ఞంలో...
నా ధమనులనీ సిరలనీ పెనవేసి వత్తులు చేసి
చైతన్య జ్యోతులను వెలిగించే తీరతాను!
ఆ మహోజ్వాలల్లో దగ్ధమవుతున్న ఉన్మాదాలన్నింటినీ చూస్తూ...
ఆ వెనుకగా విస్పష్టంగా వినవస్తున్న స్వేచ్ఛాగీతాన్ని ఆలకిస్తూ...
ఆనందంగా అస్తమిస్తాను...!!

## జాతీయతా భావానికి ప్రతీక - ఆరు దశాబ్దాల మన జాతీయగీతం - జనగణమన

జనవరి 24వ తేదీ 2010కి జాతీయగీతంగా 'జనగణమన' ను ఆమోదించి 60 సం॥లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని లోక్‌సత్తా పార్టీ రాష్ట్రంలో జాతీయభావనను మరింత పెంపొందించే ఉద్దేశంతో జనవరి 24న సామూహిక జాతీయగీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టింది. స్కూళ్ళు, కాలేజీలు, ప్రజాహిత సంస్థలు, సంఘాలు, ప్రజల సహకారంతో బహిరంగ ప్రదేశాలలో గుమిగూడి లేదా మానవహారాల రూపంలో నిలబడి జాతీయగీతాన్ని ఆలపించే కార్యక్రమాన్ని చేపట్టింది. లోక్‌సత్తా పార్టీ జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామశాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతం చేయమని కోరుతున్నాం.

మహిళాసత్తా, యువసత్తా శాఖలు కూడా ఈ కార్యక్రమాన్ని రూపొందించుకుని రాష్ట్రమంతటా నిర్వహించి విజయవంతం చేయవలసినదిగా కోరుతున్నాం.

ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించే శాఖలను ప్రత్యేకంగా గుర్తించి మన లోక్‌సత్తా పార్టీ రాష్ట్రస్థాయి సమావేశాలలో ప్రత్యేకంగా అభినందించడం జరుగుతుంది.

## 60 వసంతాల భారత రాజ్యాంగం - రిపబ్లిక్

జనవరి 26, 2010 సం॥ స్వతంత్ర భారత దేశం తన 60 సంవత్సరాల రిపబ్లిక్ దినోత్సవాన్ని చేసుకొంటున్న చారిత్రక సమయం. మహోన్నత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని ఆరు దశాబ్దాలు పూర్తి చేసుకొంటున్న ఈ శుభ సందర్భంలో ఒకసారి దేశ ప్రజలందరూ భారతరాజ్యాంగ స్ఫూర్తిని అవగతం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలకు, ప్రత్యేకంగా యువతకి రాజ్యాంగం గురించి తెలియ చెప్పవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని లోక్‌సత్తా పార్టీ రాష్ట్రమంతటా జిల్లా, మండల, పట్టణ, నియోజకవర్గ, గ్రామశాఖలు, మహిళాసత్తా, యువసత్తా శాఖలు సాధ్యమైనన్ని చోట్ల 'రాజ్యాంగం'పై చర్చలు, ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాలు, కాలేజీలలో చదువుతున్న యువతీ, యువకులకు వక్తృత్వపోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించి భారత రిపబ్లిక్ వజ్రోత్సవాలను ఘనంగా జరుపవలసినదిగా కోరుచున్నాం. వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ బహుమతులుగా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు డా॥జయప్రకాష్ నారాయణ్ సంతకంతో కూడిన 'భారత రాజ్యాంగ' ప్రతులను బహుకరించడం జరుగుతుంది. పోటీలను నిర్వహించే ప్రాంతాలలో కరపత్రములు వేసి ఒక వారం రోజుల ముందుగా వాటిని పార్టీ కేంద్రకార్యాలయమునకు పంపినట్లయితే పుస్తకములు మీకు పంపబడతాయి. కాబట్టి ఈ కార్యక్రమమును విజయవంతముగా నిర్వహించవలసినదిగా కోరడమైనది.

**వై.డి.రామారావు, 98480 80867, వి.లక్ష్మణ్ బాలాజీ 93933 93096**



# సిటిజన్స్ ఛార్టర్లు

**సిటిజన్స్** ఛార్టర్లు అంటే పౌరసేవా పత్రాలు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం ప్రజలకు అందించే సేవల వివరాలు, వాటిని అందించడానికి పట్టే సమాయాన్ని తెలియజేసే పత్రం.

ప్రభుత్వ కార్యాలయాలు, పరిపాలనా యంత్రాంగం ప్రజల కోసం, ప్రజల సొమ్ముతో నడుస్తున్నాయి. అందుచేత ప్రజలకు సేవలు అందించే జవాబుదారీతనం ప్రతి కార్యాలయానికి వుండితీరాలి. అందుకోసం రూపొందించినవే సిటిజన్స్ ఛార్టర్లు.

**సిటిజన్స్ ఛార్టర్లు ఇలా వుండాలి :**

- ప్రతి ప్రభుత్వ కార్యాలయం విధిగా అందించే సేవల పట్టిక ఉండాలి.
- ఏ సేవ ప్రజలకు ఎన్ని రోజులలో అందించేది ఉండాలి.
- నిర్దిష్టమైన దరఖాస్తు వుండాలి, దరఖాస్తుదారునికి రశీదు ఇవ్వాలి.
- గడువులోగా సేవ అందించకపోతే ప్రతిరోజు ఆలస్యానికి ప్రజలకు పరిహారం చెల్లించాలి.
- ప్రజలకు అత్యవసర సేవలకోసం నామమాత్రపు రుసుంతో తత్కాల్ పద్ధతి ఉండాలి.
- ప్రతి కార్యాలయంలో అన్ని దరఖాస్తులు స్వీకరించడానికి అన్ని సేవలు అందించడానికి ఒక పౌర సేవాకేంద్రం వుండాలి.

రాష్ట్రంలో ఇలాంటి పౌర సేవాపత్రాల ఏర్పాటు కోసం లోక్‌సత్తా ఉద్యమం కృషి చేసి కొన్ని విజయాలు సాధించింది. ఇప్పుడు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ పేరుకి సిటిజన్స్ ఛార్టర్లు వున్నాయి. ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం లేకపోవడం వల్ల అని అమలు కావడం లేదు. ఉన్నంతలో మున్సిపాలిటీలు / కార్పొరేషన్లలో ప్రకటించిన సిటిజన్స్ ఛార్టర్లు కాస్త మెరుగుగా ఉన్నాయి. అయితే కేవలం 5 సేవలకే ఈ పద్ధతిని పరిమితం చేశారు. పౌరసేవా కేంద్రం ఏర్పాటు. దరఖాస్తు దారునికి రశీదు ఇచ్చే పద్ధతి ఆలస్యానికి ప్రతిరోజుకీ 50 రూపాయలు ప్రజలకు పరిహారం చెల్లించే పద్ధతీ వున్నాయి. కొంతమేరకు ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. ■

ఉదాహరణకి మీరు ఒక మున్సిపాలిటీలో జనన సర్టిఫికేటుకు దరఖాస్తు చేస్తే రశీదు పొందవచ్చు. 5 రోజుల గడువులోగా మీకు సర్టిఫికెటు ఇవ్వకపోతే ప్రతిరోజు ఆలస్యానికి 50 రూపాయలు మీకు పరిహారంగా ఇస్తారు. ఈ పరిహారాన్ని ముందుగా మున్సిపాలిటీ మీకు చెల్లించి తర్వాత దీనికి బాధ్యులైన ఉద్యోగి జీతం నుండి రాబట్టుకుంటారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సిటిజన్స్ ఛార్టర్లను అమలు చేస్తే ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుడు పూర్తిగా తొలగిపోతుంది.



" నా బల్లమీద ఫైళ్ళు పేరుకుపోకూడదని ఆర్డర్లు వచ్చాయి. అందుకే ఆ టేబులు అక్కడ పెట్టించి ఆ ఫైళ్ళు అన్నింటిని అక్కడికి చేర్చించాము

**స్వతంత్ర్య భారతావనికి అరవై రెండేళ్ళు.... ఇంకెన్నాళ్ళు ఈ అవినీతి సంకెళ్ళు**

# వివక్ష లేని సమాజం - అందరికీ సమన్యాయం
# అన్ని వర్గాలు, మతాల మధ్య సుహృద్భావం

రిజర్వేషన్లపై
లోక్‌సత్తా విధానం

- కార్తీక్ చంద్ర

**2009... ఆగస్టులో దళిత క్రైస్తవుల్ని యస్.సి జాబితాలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయటం... డిసెంబర్‌లో దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు యస్.సి హోదా కల్పించాలన్న రంగనాథ్ మిశ్రా కమీషన్ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టటం...**

తాత్కాలిక లబ్ధి కోసం, అధికారం కోసం ఎంతకైనా తెగించటం పాతరాజకీయం స్వభావం. అందులో భాగంగానే కులాన్ని ఓ ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టటానికి రిజర్వేషన్లను ఓ అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. ఏ కులనిర్మూలన కోసమైతే మన రాజ్యాంగనిర్మాతలు రిజర్వేషన్లు పెట్టారో, ఆ లక్ష్యం శాశ్వతంగా నెరవేరకుండా కులాన్ని స్థిరీకరించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం కులాలు, మతాల మధ్య రకరకాలుగా చిచ్చుపెడుతున్నారు. ఓట్ల కోసం మేలుచేసినట్టు నటిస్తున్నారు. ఈ పాతరాజకీయం వల్లే స్వాతంత్ర్యం వచ్చి, రిజర్వేషన్లు పెట్టి ఇన్ని దశాబ్దాలు గడిచినా అణగారినవర్గాల్లో 95శాతంమంది ఇంకా దుర్భరజీవితాల్నే గడుపుతున్నారు. ఓ పక్క సమాజంలో సంపద పెరుగుతుంటే, వీరు మాత్రం యాచకుల్లానే బతుకుతున్నారు. తలెత్తితే కొట్టుకునే గుమ్మంతో ఉండే ఇల్లు, రోజువారీ జీవితం గడవటానికి ఏరోజుకారోజు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, ఇతర అవకాశాలు, వీటన్నిటి గురించీ ఆలోచించకుండా మత్తులో ఉండేందుకు విరివిగా మద్యం అందుబాటు... ఇదే కోట్లమంది అణగారిన వర్గాల వారి జీవితం. కులనిర్మూలన ఈ పాతరాజకీయంతో సాధ్యంకాదని తేలిపోయింది. కులనిర్మూలన చేసి ప్రతి బిడ్డా ఆత్మగౌరవంతో ఎదిగే అవకాశాలు కల్పించే శక్తి కొత్తరాజకీయంతోనే సాధ్యం. ఆ కొత్త రాజకీయం కోసం రెండో స్వాతంత్ర్యపోరాటం చేస్తేనే పుట్టుకతో వివక్షలేకుండా ప్రతి బిడ్డా ఎదిగే సమాజాన్ని సృష్టించుకోగలం.

ఒకరి ప్రయోజనం మరొకరికి నష్టం కాకుండా భిన్నవర్గాల మధ్య సమన్వయం సాధిస్తూ, ఉన్న పరిమిత వనరుల మధ్య అపరిమిత అవసరాలను తీరుస్తూ అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించే కొత్తరాజకీయంతో ముందుకొచ్చిన లోక్‌సత్తా పార్టీ... అందులో భాగంగా రిజర్వేషన్లపై, కులసమస్యపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించింది. రిజర్వేషన్లపై, కులనిర్మూలనపై ఇంత స్పష్టమైన విధానమున్న పార్టీ యావత్‌దేశంలో లోక్‌సత్తా ఒక్కటేనని నిస్సంకోచంగా చెప్పవచ్చు. తాత్కాలిక రాజకీయలబ్ధి కోసం నటించటం, ప్రజలను మభ్యపెట్టటటం లేవు కాబట్టే లోక్‌సత్తా ఆ విధానాన్ని అంత స్పష్టంగా ప్రకటించింది. అందులో భాగంగానే, దళిత క్రైస్తవుల్ని ఎస్.సి (షెడ్యూల్డ్ కులాలు) జాబితాలో చేరుస్తూ ఆగస్టు 25, 2009న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చేసిన తీర్మానాన్ని లోక్‌సత్తా పార్టీ స్పష్టంగా వ్యతిరేకించి, దళితులకి, దళిత క్రైస్తవులకి – ఇరువర్గాలకి న్యాయం చేసే ప్రత్యామ్నాయ పరిష్కారాలని సూచించింది. మతంపేరుతో దేశంలో మరోసారి చిచ్చురేగకుండా, మైనారిటీలని సంరక్షించేందుకు వాస్తవాలు ప్రాతిపదికన తీసుకున్న నిర్ణయం. సమాజంలో ప్రస్తుతమున్న కులాన్ని స్థిరీకరించి, లబ్ధి పొందేందుకు సంప్రదాయపార్టీలు అసెంబ్లీని వేదికగా చేసుకుంటే, అన్నివర్గాలకూ న్యాయం జరగాలని, దేశం సమైక్యంగా ఉండాలని లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వాదించారు. పెడచెవిన పెట్టి సంఖ్యాబలంతో సంప్రదాయపార్టీలు ఆ తీర్మానాన్ని ఆమోదించటం విచారకరం. అది కేవలం కంటితుడుపు చర్య మాత్రమే. లోక్‌సత్తా వాదన ఎంత వాస్తవికమైనదో, అన్నివర్గాలకూ శ్రేయస్కరమైనదో కొంచెం లోతుగా పరిశీలిస్తే అర్థమవుతుంది.

*దళిత క్రైస్తవుల్ని ఎస్.సి (షెడ్యూల్డ్ కులాలు) జాబితాలో చేరుస్తూ ఆగస్టు 25, 2009న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చేసిన తీర్మానాన్ని లోక్‌సత్తా పార్టీ స్పష్టంగా వ్యతిరేకించి, దళితులకి, దళిత క్రైస్తవులకి – ఇరువర్గాలకి న్యాయం చేసే ప్రత్యామ్నాయ పరిష్కారాలని సూచించింది.*

కులం అణచివేత నుంచి బైటపడటానికే కొందరు ఎస్.సిలు హిందూ మతం నుంచి క్రైస్తవంలోకి మారి అక్కడా తాము గౌరవంలేకుండా అదేరీతిలో వివక్షకు గురవుతున్నామని, అందువల్ల తమకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించాలని దళిత క్రైస్తవులు బ్రిటీషు ప్రభుత్వాన్ని కోరారు. 1919లో సైమన్ కమిషన్ సిఫార్సుతో మతపరమైన రిజర్వేషన్లకు చట్టం చేశారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక హిందూమతంలోని ఎస్.సిలకు రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చింది. హిందూ సమాజంలో కులం చట్రంలో నలిగిపోతున్న అణగారిన కులాలను ఆ విషవలయం నుంచి తప్పించే లక్ష్యంతోనే షెడ్యూల్డ్ జాబితాలో చేర్చి ప్రత్యేకంగా రిజర్వేషన్లను కల్పించారు. బ్రిటీషర్లు కల్పించిన అవకాశాలతో దళిత క్రైస్తవులు హిందూసమాజంలో ఉన్న దళితులకంటే ఎక్కువస్థాయిలో విద్య, అవగాహన, చైతన్యం అందాయి. అందుకే వారి పరిస్థితి హిందూసమాజంలోని దళితుల కంటే మెరుగ్గా ఉంది. అయితే క్రైస్తవంలో ఉన్నా తమ పరిస్థితి మెరుగవలేదనే భావన దళిత

క్రైస్తవుల్లో పెరుగుతుండటంతో, కొన్నిరాష్ట్రాలు వారికి వెనకబడిన తరగతుల కేటగిరీలో బి.సి-సి విభాగంలో వారికి రిజర్వేషన్ కల్పించాయి. ఆంధ్రప్రదేశ్ 1970లోనే ఆ అవకాశాన్ని కల్పించింది. 1993లో జాతీయ ప్రభుత్వం కూడా దళిత క్రైస్తవులకు ఓబీసీ హోదాను ఇచ్చింది. అయితే ఎస్.సిలకు ఇస్తున్న రిజర్వేషన్లను తమకు కూడా వర్తింపచేయాలనే డిమాండ్ కొనసాగుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం వెతుకుదామన్న సంకల్పం లేకుండా, రాజకీయవాదులు దళితులకి, దళిత క్రైస్తవులకి మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకునేందుకు దీన్నో ఆయుధంగా ఉపయోగించుకునే ప్రయత్నం మొదలుపెట్టారు.

ఎస్.సిలకు ఇస్తున్న రిజర్వేషన్లు కేవలం రాజ్యాంగంలో పేర్కొన్న హిందూ లేదా దాన్నుంచి ఆవిర్భవించిన మతాలకు మాత్రమే వర్తిస్తాయని, వారు మతం మారితే వారికి రిజర్వేషన్లు వర్తించబోవని 1985లో సూసాయ్ వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోకుండా 1989లో వచ్చిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చేశాయి. 1996లో వచ్చిన పీవీ నరసింహారావు ప్రభుత్వం దళిత క్రైస్తవులకు ఎస్.సి హోదా ఇచ్చేందుకు బిల్లు కూడా సిద్ధం చేసి చివరి నిమిషంలో లోపాలున్నాయని వెనక్కితగ్గింది. ఇక అక్కడ్నుంచి ఎన్నికల ప్రణాళికల్లో హామీగా గుప్పించటం మొదలుపెట్టారు. "దళిత క్రైస్తవుల పట్ల వివక్ష ఉంది. మతం మారినా వారిలో చాలామంది పరిస్థితి మారలేదు. అదేసమయంలో ఎస్సీ హోదాలో రిజర్వేషన్లు సాధ్యం కాదు. ఏమిటి పరిష్కారం?" అనే యోచన ఆ పార్టీల్లో కొరవడింది.

> *ఎస్.సిలకు ఇస్తున్న రిజర్వేషన్లు కేవలం రాజ్యాంగంలో పేర్కొన్న హిందూ లేదా దాన్నుంచి ఆవిర్భవించిన మతాలకు మాత్రమే వర్తిస్తాయని, వారు మతం మారితే వారికి రిజర్వేషన్లు వర్తించబోవని 1985లో సూసాయ్ వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోకుండా 1989లో వచ్చిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చేశాయి.*

**ఎస్.సిలకుండే అన్ని హక్కులతో దళిత క్రైస్తవులకు బి.సి- సి కేటగిరీలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలి**

దీనికి పరిష్కారం సాధించాలన్నదే లోక్‌సత్తా వాదన... ఆ పరిష్కారంలో భాగంగానే దళిత క్రైస్తవులకు బి.సి. 'సి' కేటగిరీలో వారి జనాభా మేరకు విద్య, ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తూ రిజర్వేషన్ కల్పించాలని లోక్‌సత్తా ప్రతిపాదించింది. బి.సి వర్గీకరణ ఉందికాబట్టి, ఇందుకు ఎటువంటి సమస్యా తలెత్తదు. వర్గీకరణ ఉన్న కారణంగా బి.సి 'సి'లో ఇచ్చిన రిజర్వేషన్లు కేవలం దళిత క్రైస్తవులకి మాత్రమే వర్తిస్తాయి. అందులో దళిత క్రైస్తవులకే ప్రయోజనం చేకూరుతుందిగాని, ఇతర కులాలవారు వారితో పోటీపడలేరు. అదేసమయంలో దళితుల ఎస్.సి కోటాలో దళిత క్రైస్తవుల నుంచి పోటీ ఉండదు. అలాగే బి.సి-సిలో రిజర్వేషన్ కల్పించేటప్పుడు ఎస్సీలకు రిజర్వేషన్ ద్వారా వర్తించే ప్రత్యేక హక్కులు, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం తదితర అన్ని హక్కుల్నీ కల్పించవచ్చు. అంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించకుండానే ఎస్సీలకుండే అన్ని హక్కుల్నీ దళిత క్రైస్తవులకూ ఇవ్వాలని లోక్‌సత్తా పరిష్కారం చూపుతోంది. ప్రజాస్వామ్యం, ధర్మం, జనహితం, అన్నివర్గాల ప్రయోజనాలనూ పరిరక్షించే దిశగా మనం పరిష్కారాన్ని వెతకాలనే విజ్ఞతతోనే, బాధ్యతతోనే లోక్‌సత్తా ఈ పరిష్కారాన్ని సూచిస్తోంది.

ఈరోజు దళిత క్రైస్తవులతోపాటు దళిత ముస్లింలు కూడా ఈ రిజర్వేషన్లు అడుగుతున్నారు. సంప్రదాయపార్టీలు చెబుతున్న పరిష్కారాన్నే అమలు చేయాలని చూస్తే చిచ్చు మరింత పెద్దదై అసలు సమస్య కంటే ఆ పరిష్కారమే పెద్ద సమస్యగా మారుతుందనటంలో సందేహం లేదు. మనం పోరాడవలసింది అన్ని వర్గాలకీ, అన్ని మతాలకీ సమన్యాయం చేసే ఏర్పాట్ల కోసం మాత్రమే. దళితుల్లోని ఇంకా అణగారినవారికి అన్యాయం జరగకుండా పరిష్కారాల్ని వెదికే బాధ్యతని విస్మరిస్తే మంచికంటే చెడు జరిగే ప్రమాదముందని గుర్తించాలి.

హిందూమతం నుంచి వచ్చిన సిక్కు, బౌద్ధం వంటి మతాల విషయంలో తలెత్తని అభ్యంతరాలు క్రైస్తవ, ముస్లిం వంటి సెమెటిక్ మతాల విషయంలో మౌలికంగానే వస్తుంది. అందుకే రాజ్యాంగంలోని 25(2) అధికరణం ప్రకారం హిందూమతంలో సామాజిక సంక్షేమాన్ని సాధించటానికి, కుల విభేదాలని నిర్మూలించే సంస్కరణలని సాధించటానికి, అన్ని వర్గాలకి దేవాలయాలలో, మత సంస్థలలో ప్రవేశం లభించటానికి వీలుగా చట్టాలను చేసే అధికారాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు చట్టసభలకిచ్చారు. ఇతర మతాలవారి విషయంలో ఇలా జోక్యం చేసుకునే అధికారం చట్టసభలకి లేదు. ఇదే అధికరణంలో 'హిందూ' అనే పదం సిక్కు, జైన, బౌద్ధ మతాలకి కూడా అన్వయిస్తుందని రాజ్యాంగ నిర్మాతలు స్పష్టంగా పేర్కొన్నారు. అందువల్లనే ఈ మతాలలో కులం వాసనలున్నట్లయితే ఎస్.సి. రిజర్వేషన్లు వారికి వర్తిస్తాయి. కులం అనేది ఇస్లాం, క్రైస్తవం వంటి సెమెటిక్ మతాల్లో ఏ కోణంలో చూసినా నిర్వచనానికి అందదు. దానివల్ల ఎస్.సి రిజర్వేషన్ అనే నిర్వచనం ఆ మతాలకు వర్తింపచేయటం అసాధ్యమవుతుంది. అణగారినవర్గాల మధ్య చిచ్చుపెట్టాలని కాకుండా సమగ్ర పరిష్కారం కావాలి, దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీలకున్న అన్ని హక్కులూ లభించాలంటే లోక్‌సత్తా చెప్పేదే సమగ్ర పరిష్కారం.

**ఆ రాజకీయాన్ని మార్చి కులం సమస్యకు శాశ్వత పరిష్కారం చెబుతూ, కులరహిత సమాజం దిశగా లోక్‌సత్తా కొత్తరాజకీయం మార్గాన్ని చెబుతోంది... ఇప్పుడున్న రిజర్వేషన్లు ఉపశమనం మాత్రమే. వాటిని కొనసాగిస్తూనే కులవ్యవస్థను శాశ్వతంగా నిర్మూలించి కులరహిత సమాజాన్ని నిర్మించే ఎజెండాను లోక్‌సత్తా తన విధానంలో పొందుపరిచింది.**

ప్రస్తుతం రిజర్వేషన్లు పొందుతున్న కులాలలో, పొందని కులాలలో పేదల పిల్లలకు అవకాశాలు దక్కటంలేదన్న అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా వ్యాపించి ఉంది. రిజర్వేషన్లు పొందుతున్న కులాలలో వర్గీకరణ రూపంలో ఉపకులాల హక్కుల రూపంలో ఇది వ్యక్తమవుతోంది. ఇతర కులాలలో ఆర్థికంగా వెనకబడిన వారికి రిజర్వేషన్లు కావాలన్నది నినాదంగా ఉంది.

వాస్తవానికి 90శాతంమంది పిల్లలు 12వ తరగతి లోగానే చదువుకు దూరం అవుతున్నారు. పైచదువులకు 10శాతం కూడా రావటం లేదు. అందుచేత కులవిద్వేషాలకు, ఉపకుల వ్యత్యాసాలకు తావులేకుండా పేదలందరికీ ఎదిగే అవకాశాలను కల్పించటానికి లోక్‌సత్తా చెబుతున్న విధానంలోని అంశాలు...

1. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి 50శాతానికి లోబడి కొనసాగించాలి
2. ఈ రిజర్వేషన్ల లోపల ఆ కులాలలో రిజర్వేషన్ల ద్వారా సంపన్నులైనవారు, పెద్దపెద్ద హోదాలను పొందినవారు తిరిగి రిజర్వేషన్లను సొంతం చేసుకోకుండా ఆ కులాలలోని పేదలకు దక్కేలా తగిన ప్రాతిపదికల్ని రూపొందించాలి. దీనికి ఆయా కులాల్లోని ఆలోచనాపరులు చొరవచూపాలి.

**రిజర్వేషన్ల చుట్టూ కీచులాటలు లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించే దీటైన పరిష్కారాన్నిస్తూ ఒక్క తరంకాలంలో కులనిర్మూలన సాధించాలనే లక్ష్యంతో ఉన్న ఈ కొత్త రాజకీయాన్ని సాధించుకునే దిశగా కలిసిరావాలని రాష్ట్రంలోని యువతకు, మహిళలకు, ఆలోచనాపరులకు లోక్‌సత్తా పార్టీ పిలుపునిస్తోంది.**

## ప్రత్యామ్నాయ శక్తిగా లోక్‌సత్తా

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయాన్ని తెచ్చే దిశగా మూడేళ్ల క్రితం రూపుదిద్దుకున్న లోక్‌సత్తా పార్టీ... విధానాల ప్రాతిపదికన రాజకీయం చేస్తూ 2009లో తన స్థానాన్ని సుస్థిరపరుచుకుంది. ఓట్లు- సీట్లు కోసం కాకుండా, ప్రజాప్రయోజనాల కోసమే ప్రతి అంశం మీద స్పందించి ప్రజలకు వాస్తవాలు తెలియచెప్పడం జరిగింది. చెప్పినదానికి, చేసినదానికి మధ్య అంతరాన్ని సాధ్యమైనంత తగ్గించుకుంటూ విశ్వసనీయతకు నిదర్శనంగా ఉండేలా లోక్‌సత్తాను తీర్చిదిద్దే ప్రయత్నం చేశాం. 'ప్రజలకే అధికారం' అనే మన పార్టీ మౌలిక సిద్ధాంతాన్ని 2009లో ప్రజల్లోకి ఆచరణాత్మకంగా తీసుకెళ్లగలిగాం. మన ఎజెండాకు విస్తృత జనామోదం లభించింది. ఎన్నికల్లో సామాన్య, మధ్యతరగతి, విద్యావంతులకు, పెద్దసంఖ్యలో అణగారినవర్గాలకు టికెట్లు ఇవ్వటం ద్వారా జనరాజకీయాన్ని లోక్‌సత్తా ఆచరణలో చూపింది. డబ్బు, మద్యం పంచకపోవటం, వ్యక్తిగత దూషణలు లేకుండా మనం చేసిన హుందా ప్రచారసరళి దేశరాజకీయాల్లోనే తొలిసారిగా చర్చనీయాంశమయ్యాయి. ఇటీవలి గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో 'వార్డు మేనిఫెస్టో' ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ప్రజల్లో ఉన్న ఆదరణను ఓట్ల రూపంలో మలచుకునే దిశగా సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయటం, సంస్థాగత నిర్మాణం పటిష్టంచేయటంతో 2010లో మరింత బలమైన శక్తిగా రూపుదిద్దుకునేందుకు కృషి చేద్దాం.

## జిల్లాల నేతలతో గ్రామస్థాయి ప్రజలతో

### లోక్‌సత్తా ప్రత్యక్ష సమావేశాలు

రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు చెందిన 30మంది కోర్‌కమిటీ సభ్యులు విశాఖపట్నం, కర్నూలు, వరంగల్ జిల్లాల్లో గ్రామసభలు నిర్వహించటంతోపాటు జిల్లా కేంద్రంలో చర్చావేదికను నిర్వహిస్తారు. జనవరి 19న విశాఖపట్నం, 21న కర్నూలు, 23న వరంగల్ జిల్లాలో ఓ గ్రామాన్ని ఎంచుకుని ప్రజల అభిప్రాయాలతోపాటు సమస్యకు వారు తెలిపే పరిష్కారాల్ని కమిటీ సభ్యులు తెలుసుకుంటారు. అదేరోజు సాయంత్రం ఆ జిల్లా కేంద్రంలో చర్చావేదికను నిర్వహిస్తారు. రాష్ట్ర విభజన జరిగితే విభజనని వ్యతిరేకించే వర్గాలను ఎలా సంతృప్తి పరచగలం, ఒకవేళ సమైక్యాంధ్ర కొనసాగితే, విభజనని కోరే ప్రజల ఆకాంక్షల్ని ఎలా నెరవేర్చగలం అనే ప్రశ్నలకు ప్రజల నుంచే పరిష్కారం రావటం సంక్షోభం ఒక కొలిక్కి తీసుకురావటానికి ఉపకరిస్తుంది.

అందువల్ల అట్టడుగుస్థాయిలో ప్రజలతో చర్చలు, జిల్లా స్థాయి నేతల అభిప్రాయాలను తీసుకోవటం ద్వారా ఆచరణసాధ్యమైన పరిష్కారానికి స్థూల మార్గదర్శక సూత్రాలను రూపొందించేందుకు లోక్‌సత్తా ప్రయత్నిస్తోంది.

# న్యూస్‌డైజెస్ట్

**అవినీతి**

- జె.ఎన్.టి.యులో డిటెన్షన్ విధానంలో అనుబంధ ప్రైవేటు కళాశాలల నుంచి దాదాపు రూ॥ 60 కోట్ల స్వాహా చేసారని అందిన ఫిర్యాదు మేరకు హక్కుల కమిషన్ చైర్మెన్ సాంకేతిక విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి, జె.ఎన్.టి.యు.వీసిలకు నోటీసులు జారీ చేసారు.
- ఆలయాల డిపాజిట్లు కోట్లకొద్దీ హారతి కర్పూరం అభివృద్ధి పేరుతో సొమ్ములు యధేచ్ఛగా దుర్వినియోగం.
- ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, నిర్మాత సుభాష్ ఘయ్‌కి రాష్ట్రప్రభుత్వం చవకగా విలువైన భూమి (ఎకరం 10 కోట్లు వుంటే రూ. వెయ్యి చొప్పున 20 ఎకరాలు లీజుకు కేటాయించడం రాజ్యాంగ, చట్ట విరుద్ధమని హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు.
- నీటిపారుదల శాఖ కార్యాలయం, అధికారుల వినియోగం కోసం కలాలు, సబ్బులు, టవళ్ళు, కప్పుల వంటి సామాగ్రి కొనుగోలుకు రూ.2.1 లక్షలు వెచ్చించారు. (రెండు పెన్నుసెట్లకు రూ. 34 వేలు)
- వ్యాపారలైసెన్సులలో కోట్లలో గ్రేటర్ ఖజానాకు చిల్లు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సుమారు 2.39 లక్షల మంది బోగస్ లబ్ధిదారులు
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో తప్పుడు బిల్లులతో ప్రజాధనం దుర్వినియోగం – లోకాయుక్త కన్నెర్ర
- అంచనాలు మించిన దేవాదుల, భారీగా పెరిగిన వ్యయం 2005లో 6526.60 కోట్లుతాజాగా 9707.71
- వ్యవసాయ శాఖ రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేసిన రాయితీ విత్తనాల పంపిణీలో 60 కోట్ల మేర స్వాహా
- వికలాంగులు, వితంతువులు, వృద్ధుల పేరిట మంజూరవుతున్న పింఛన్లలో అనర్హుల కైంకర్యం

**ఆర్థికం**

- ఆర్టీసి కార్మికులకు 24% జీతాల పెంపు
- ఏడాదికి రూ॥12 వేలకన్నా ఎక్కువఫీజు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలు ఫీజుల నియంత్రణ మండలి నుండి అనుమతి తీసుకోవాలంటూ ప్రభుత్వం సంబంధిత జీవోను జనవరి 5న జీవోను జారీ చేసింది.
- హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు –2010ను చెన్నైలో జరిపేందుకు భారతీయ పరిశ్రమల సమఖ్య నిర్ణయం.
- నర్సింగ్ విద్యార్థుల వేతనం పెంపు
- రైతులకు అందని విపత్తు పరిహారం, ఉత్తర్వులకు పరిమితమైన సాయం నిధులు ఇవ్వకుండా ట్రెజరీకి ఆదేశాలు. ఆందోళనలో 14 లక్షల మంది అన్నదాతలు
- పి ఆర్సీ సిఫార్సుల్లో ద్వంద్వప్రమాణాలు, 10% మందికే వర్తింపు. సర్వీసు టీచర్లకు అన్యాయం సీనియర్ జూనియర్ ఉపాధ్యాయ సర్వీసుల్లో లేని తేడా.
- విద్యుత్తు వినియోగంలో రికార్డుస్థాయిని దాటిన రాష్ట్రం కరెంటు వాడకం.
- బోర్లవ్యథలు మళ్ళీ మొదలు. నీటికోసం అన్నదాత తిప్పలు, తడిసిమోపడవుతున్న ఖర్చు, వేలు, లక్షలు వెచ్చించినా పాతాళంలోకి వెళ్ళిన గంగను పైకి తెప్పించే ప్రయత్నంలో రైతులు అప్పులపాలు.
- 14.5% శాతానికి వ్యాట్‌పెంపు అసంఖ్యాక వస్తువుల పెరగనున్న ధరలు
- భారీగా క్షీణించిన పెసర, మినుము, దిగుబడులు, మూడు నెలల వర్షాభావఫలితం

**పరిపాలన**

- రాష్ట్ర ఎన్నికల కమీషనర్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన రమాకాంత్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది.
- విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి కావలసిన ఋణం కోసం జపాన్ బ్యాంకు దగ్గరకు వెళ్ళిన ట్రాన్స్‌కో అధికారుల మీద ఏ రాష్ట్రం? మీరు ఏ రాష్ట్రంలో సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు? మాకు ఈ ఋణాన్ని ఎవరు తిరిగి చెల్లిస్తారు, లాంటి ప్రశ్నల పరంపరకు తెల్లమొహం.
- గ్రేటర్ కమిషనర్‌గా సమీర్ శర్మ నియామకం.
- ఈ సేవా కేంద్రాల్లో ఇకనుంచి రేషన్‌కార్డులో మార్పులు చేర్పులు.
- వచ్చే నాలుగేళ్ళలో 60 కోట్ల మందికి యుఐడి సంఖ్యలు ఇస్తామని తెలిపిన యుఐడి అధికారసంస్థ డిప్యూటి డైరక్టర్ జనరల్.
- మితిమీరిన రాజకీయ అధికార జోక్యంతో శాస్త్ర సాంకేతికరంగాల్లో తిరోగమనం – ప్రధాని
- సబ్‌రిజిస్ట్రార్‌లకు గెజిటెడ్ హోదా
- దీర్ఘకాల కరెంటు కొనుగోలు ఒప్పందాలకు ట్రాన్స్‌కోకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి
- కొత్తగా నిర్మించే ప్రభుత్వ భవనాలలో పర్యావరణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం.

**రక్షణ**

- ఆస్ట్రేలియాలో మరో భారతీయ యువకుడి హత్య
- రాష్ట్ర వ్యాప్తంగా కేసుల పరిశోధన వివరాలను జనవరి 1 నుంచి అన్‌లైన్‌లో పెట్టనున్న పోలీస్‌శాఖ.
- లైంగిక నేరాలపై 2 నెలల్లోనే విచారణ పూర్తి సి.ఆర్.పి.సికి కేంద్రం సవరణలు మహిళా న్యాయమూర్తులే ఈ కేసులు విచారించి ఇంట్లోనే బాధితురాలి వాంగ్మూలం నమోదు చేయాలి. అనుమానితులకు వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి. కోర్టు తీర్పుపై బాధితులు అప్పీలు చేసుకోవచ్చు.
- బీహార్ రైళ్ళకు తాలిబన్‌దాడుల ముప్పు

**రాజకీయం :**

- రాష్ట్ర సంక్షోభంపై అఖిలపక్ష సమావేశంలో వ్యతిరేకత వ్యక్తం చేయని పార్టీలు, తదుపరి కార్యచరణ కేంద్రం కోర్టులో అఖిలపక్ష భేటిలో ఏకాభిప్రాయం లేదు, ప్రాంతాలవారీగా నేతల వాదనలు, కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు, వెంటనే ప్రక్రియ ప్రారంభించాలన్న తెరాస, భాజపా, సిపిఐ, సమైక్యాంధ్ర ముద్దు ప్రరాపా, సిపిఎం, తెదేపా ఎటు వాదన అటే, రాష్ట్రపతిపాలన పెట్టాలన్న ఎంఐఎం, సావధానంగా విన్న చిదంబరం, శాంతిని కాపాడాలంటూ అన్ని పార్టీల సంయుక్త ప్రకటన, దేశరాజధానిలో నినాదాలహోరు, అభిప్రాయాల సారంపైనే తదుపరి అడుగు, అవసరమైతే ఇతర గ్రూపులలోనూ సంప్రదింపులు, సహేతుకమైన కాల పరిమితి – చిదంబరం
- చిన్న పార్టీలతో ప్రజాస్వామ్యం బలపడుతోంది ప్రధాని మన్మోహన్ సింగ్

**విద్య**

- రాష్ట్రంలో ఉద్యమాల కారణంగా వార్షిక పరీక్షల నిర్వహణ, తేదీల ఖరారుపై తీవ్రగందరగోళం ఏర్పడింది.
- ప్రాథమిక విద్య విస్తృతికి ఉద్దేశించిన సర్వశిక్ష అభియాన్ సత్ఫలితాలనిస్తుండటంతో ప్రపంచ బ్యాంకు రూ.2,500 కోట్ల రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చింది.
- అధ్యాపకుల కొరతపై టాస్క్‌ఫోర్స్ ఐఐటీ, ఐఐఎంల ప్రొఫెసర్లతో అత్యున్నత స్థాయి కమిటీ, పాఠశాలల్లోను ఉపాధ్యాయుల కొరత
- 17 వేల మంది రెన్యూవల్ విద్యార్థులకు రూ. 22 కోట్ల ఉపకార వేతనాలు

**వైద్యం**

- కీమోథెరపీ లేదా ఎముక మార్పిడి శస్త్ర చికిత్సల తర్వాత లుకేమియా (బ్లడ్‌కేన్సర్) వ్యాధి మళ్ళీ పెరగకుండా అడ్డుకునే టీకాను బ్రిటిష్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.
- గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల సంఖ్య గణనీయంగా పెంచేందుకు గుర్తించిన గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకోసం ప్రత్యేకంగా మూడున్నరేళ్ళకు కుదించిన బ్యాచులర్ ఆఫ్ రూరల్ మెడిసన్ అండ్‌సర్జరీ (బి.ఆర్.ఎం.ఎస్) కోర్సును ప్రవేశ పెట్టడానికి భారతీయ వైద్యమండలి (ఎం.సి.ఐ) ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్ళపాటు పనిచేసే ఎం.బి.బి.ఎస్. విద్యార్థులకు పి.జి.కోర్సులో ప్రవేశానికి 25% రిజర్వేషన్ ఇవ్వడానికి ప్రతిపాదించారు.
- ఫలానా ఫార్మకంపెనీ మందులు మంచివంటూ వైద్యులు ప్రచారం చేయకుండా ఎంసిఐ కొత్తప్రవర్తన నియమావళిని రూపొందించింది.
- హృద్రోగ సమస్యలతో సతమతమవుతున్న వారికోసం బ్రిటన్ శాస్త్రవేత్తలు కృత్రిమ ధమనిని తయారుచేసారు.
- రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకం అమలులో తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది.
- 2009లో స్వైన్‌ఫ్లూ, కలరా, డయోరియా, జాండీస్. డెంగీ, చికున్‌గున్యావంటి వ్యాధులు గత సంవత్సర కంటే విజృంభించి తీవ్ర ప్రభావం చూపాయి.

**వ్యవసాయం**

- కృష్ణాడెల్టా, కె.సికెనాల్ ఆయకట్టుకు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లోని నీరు నిల్వలను పరిగణనలోకి తీసుకుని 40 టీఎంసిల నీటిని విడుదల చేయాలని ఉన్నతస్థాయి ఇంజనీర్ల కమిటీ నిర్ణయించింది.
- గత ఏడాదితో పోలిస్తే గంగ, గోదావరి బేసిన్లలో తగ్గిన ప్రవాహం, కృష్ణ కావేరిల్లో మెరుగు – కేంద్ర జలసంఘం వెల్లడి
- దేవాదుల ఎత్తిపోతల పథకానికి ఎదురైన నీటి సమస్య పరిష్కారం కోసం గోదావరికి అడ్డంగా తాత్కాలికంగా నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వ కసరత్తు.

**సామాజికం**

- ఉపకార వేతనాలకోసం ....50 ఇంటర్వ్యూల్లో విఫలమయ్యా – నోబెల్‌గ్రహీత రామకృష్ణన్
- నిరుపేదలైన రిక్షా కార్మికులు కర్షకులు, దినసరి కూలీలకు సైతం విశ్రాంత జీవనంలో నెలనెలా పింఛన్ అందుకునేలా సామాజిక భద్రత అందించే పథకాన్ని పింఛన్ నియంత్రణ సంస్థ పిఎఫ్ ఆర్‌డిఎ ఏప్రిల్ 1 నుంచి ప్రవేశ పెడుతోంది. స్వయం సహాయ గ్రూపుల్లో భాగంగా ఎవరైనా ఈ పథకంలో ప్రారంభంలో రూ॥ 105, తర్వాత ఏటా రూ॥ 70 చెల్లించి చేరవచ్చు.
- మేం తాలిబన్లమా? లగడపాటిని ఢిల్లీలో నిలదీసిన విద్యార్థులు
- రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు తక్షణం, తగిన రీతిలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.
- డిసెంబరు నెలలో తెలంగాణా సీమాంధ్ర జిల్లాల్లో ఉద్యమాల వల్ల మిగిలిన వ్యాపారాలు కుదేలైతే మద్యం విక్రయాలు 200 కోట్లు పెరిగి 1102 కోట్లకు చేరుకున్నాయి.
- జె.ఎన్.ఎన్ యూ ఆరో ఎం ఇళ్ళని నిర్మాణ ప్రాజెక్టులో నిబంధనలకు అనుగుణంగా కేంద్రం విడుదల చేసిన రూ॥ 109 కోట్లను జి.హెచ్.ఎం.సి.కి విడుదల చేయకుండా ఖజాన బోసిపోయి ఆవురావురుమంటున్న రాష్ట్ర సర్కారు తన ఖాతాలో వేసుకోవడంతో బిల్లులురాక ఇళ్ళ నిర్మాణాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.
- వృద్ధులు వికలాంగులు ఇకనుంచి దరఖాస్తు చేసిన నెల రోజుల్లోనే పింఛను పొందే అవకాశాన్ని కల్పిస్తున్నారు. పింఛన్లు లేని వారు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే మీ కోసం కార్యక్రమంలో దరఖాస్తు చేస్తే పరిశీలిస్తారు.
- ప్రైవేటు ఎఫ్ఎంలలో వాతావరణం, ట్రాఫిక్, క్రీడల అంశాల ప్రసారానికి అనుమతించవలసిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసారు.
- ఛత్తీస్‌ఘడ్ నక్సల్స్ ప్రభావిత గిరిజన గ్రామాల్లో, గూడేలలో ఇంటికి ఒకరు చొప్పున చిన్నారులను ఉద్యమాలలోకి తరలిస్తున్నారు. పలకాబలపం పెట్టాల్సిన వారిలో విప్లవపాఠాలు వల్లెవేయించి, నాటు తుపాకుల శిక్షణనిస్తున్నారు.

# లోక్‌సత్తా పార్టీ జిల్లాలవారీ సమాచారం






### కర్నూలు

**ప్రారంభోత్సవానికి సిద్ధంగా వున్న రివర్స్‌ఆస్మాసిస్ ప్లాంట్**

వరదవిపత్తు వల్ల అతలాకుతలం అయిన కర్నూలు జిల్లా గొందిపర్ల గ్రామపంచాయితీ పూలతోట గ్రామాన్ని లోక్‌సత్తా పార్టీ దత్తత తీసుకుంది. ఈ గ్రామంలో డా॥ జే.పి. పర్యటించినప్పుడు గ్రామ ప్రజల కోరిక మేరకు మంచినీటి సౌకర్యం కోసం రూ॥ 3 లక్షల ఖర్చుతో రివర్స్ ఆస్మాసిస్ ప్లాంట్ కట్టి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. రాష్ట్ర పరిశీలకులు వేమిరెడ్డి విజయేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆర్. నరసింహా, జిల్లా కార్యదర్శి ఎమ్. శ్రీనివాస్, శ్రీమతి ఎమ్. పద్మ (పాణ్యం) మరియు లోక్‌సత్తా అభిమాని శ్రీనివాస రెడ్డి తదితర కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ నిర్మాణం జరిగింది.

### హైదరాబాద్

అడిక్‌మెట్ డివిజన్‌లోని ఎస్.ఆర్.జె. క్వార్టర్స్‌లోని అంతర్గత రోడ్ల రిపేరు పనులు గ్రేటర్ ఎన్నికల కంటేముందర మొదలై నేటికీ పూర్తికాక ప్రజలు తీవ్ర అసౌకర్యం గురౌతున్నారు. ఎన్నో సందర్భాలలో, వృద్ధులు, పిల్లలు గాయాలపాలౌవుతున్నారు. ఈ విషయాన్ని బస్తీ ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్ళినా నేటికీ ఫలితం లేకపోయింది. ఈ సందర్భంగా లోక్‌సత్తాపార్టీ డివిజన్ అధ్యక్షులు కౌండిన్య ప్రసాద్, డివిజన్ సభ్యులు, హనుమంతు యాదవ్, శ్యామ్, తాండవకృష్ణ, చంద్రశేఖర్‌తో పాటు బస్తీ వాసులు కే. యాదగిరి, వెంకటేశ్వర్లు, కమలమ్మ, బి. రామచందర్, సందర్శించారు. రోడ్డు రిపేరు పనులు వారంరోజుల్లో పూర్తి చేయమని సంబంధిత అధికారులను కోరారు.

***Interns Required***

Foundation for Democratic Reforms is taking up a study to unearth the possible political levers which Lok Satta Party could use in years to come. The study will focus on the voter in Hyderabad and will evaluate the role played by various organizations like the Election Commission and political parties in Indian polity. The study is based in Hyderabad and requires a minimum of 20 volunteers. Interns will be required to work on the weekends and help the research team collect data, collate it and interpret it.

At the beginning of the study each intern will be trained in social science and market research methodology. On completion of the study interns will be provided certificates of participation and an honorarium. Members of the party and well wishers of the party, interested in the study, should apply as early as possible. Mail your resumes to kvbhaskar.hcu@gmail.com.

Please circulate this call widely amongst your friends and well wishers.

Research Team,
Foundation for Democratic Reforms

**లోక్‌సత్తాకు పబ్లిక్ ఎజెండా మాత్రమే తప్ప ప్రయివేటు ఎజెండా ఏనాడూ లేదు.**

# కలల్ని సాకారం చేసుకోండి... అంతరాలు లేని సమాజాన్ని నిర్మించండి

### జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జేపీ శుభాకాంక్షలు

ఎటువంటి భయమూ, విద్వేషాలు, అంతరాలూ లేకుండా అందరికీ స్వేచ్ఛ, అవకాశాలు ఉండే భారతదేశాన్ని నిర్మించుకునేందుకు యువత నడుంబిగించాలని జాతీయ యువజన దినోత్సవం (జనవరి 12) సందర్భంగా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

దేశజనాభాలో 73శాతంమంది 35ఏళ్లలోపు వారేనని, రాబోయే కాలంలో 92శాతం వారిదేనని జేపీ అన్నారు. "ఈవేళ్టి యువతలో ఆదర్శం, ఆలోచన, ఆవేశం పుష్కలంగా ఉన్నాయి. దేశనిర్మాణంలో ఈతరం ఎవరికీ తీసిపోదు. అలాగే మానవచరిత్రలో మొదటిసారిగా తమ కలల్ని సాకారం చేసుకునే వనరులు, సాంకేతిక పరిజ్ఞానం ఈతరం యువతకు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి వివక్షలేకుండా ప్రతి బిడ్డా ఎదిగే అవకాశాల్ని కల్పించి, నివారించదగ్గ ప్రతి బాధనూ తొలగించే సమాజాన్ని నిర్మించటం ప్రతి యువతీయువకుని బాధ్యత కావాలి. కులం, మతం, ప్రాంతం, భాష, ఆఖరికి జాతీయత కూడా కాకతాళీయమే. వీటి ప్రాతిపదికన ఏ బిడ్డ పట్లా వివక్షను చూపటం ప్రస్తుత తరంలో, కాలంలో ఎంతమాత్రం ఉండకూడదు" అని జేపీ పేర్కొన్నారు.

**"ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో, తలెత్తుకుని తిరగగలుగుతామో**

**ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా ఉంటుందో**

**ఎక్కడ సంకుచిత అడ్డుగోడలతో ప్రపంచం ఛిన్నాభిన్నంకాకుండా ఉంటుందో**

**... అటువంటి స్వేచ్ఛాయుత ప్రపంచంలోకి నా దేశం నడవాలి"** అని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్ గత శతాబ్దంలో అన్న మాటల్ని ఈతరం యువతైనా సాకారం చేయాలని జయప్రకాష్ నారాయణ్ ఆకాంక్షించారు.

# యువసత్తా

### అవినీతికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

'పేదరికం, లంచగొండితనం అరికట్టడం ఎవరి బాధ్యత?' అనే అంశంపై లోక్‌సత్తా పార్టీ యువసత్తా అధ్వర్యంలో మంగళవారం అభిప్రాయ సేకరణ చేపట్టారు. స్వామి వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని గుడిమల్కాపూర్ శివబాగ్ (వివేకానంద చౌరస్తా)లోని స్వామిజీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవినీతి అంశంపై పలువురి సంతకాలు సేకరించారు యువసత్తా రాష్ట్ర కన్వీనర్ రత్నం, పార్టీ నగర నాయకుడు మాణిక్ ప్రభులు. క్రమశిక్షణతో కూడుకున్న సమాజం కావాలంటే యువత పాత్ర కీలకమని ఆనాడే స్వామి వివేకానంద చెప్పారని వారు గుర్తు చేశారు. డివిజన్ నేతలు సుదర్శన్ రవీందర్, కృష్ణారెడ్డి, మహేందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



### పేదలకు దుప్పట్లు పంపిణీ

వివేకానంద జయంతి సందర్భంగా దోసపాటి రాము (యువసత్తా) తెల్లవారుజామున పలువురు యువకులతో కలిసి దిల్‌సుఖ్ నగర్, మలక్‌పేట ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై చలిలో పడుకున్న పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం నల్గొండ క్రాస్‌రోడ్డులోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**వివిధ అంశాలపై మీరడిగే ప్రశ్నలకు డా॥ జేపి. సమాధానాలిస్తారు**

**ప్రచురించబడిన ప్రతి ప్రశ్నకు రూ॥100/- బహుమతి పంపబడుతుంది.**

# భారత రాజకీయాలు అధఃపాతాళంలో

**- మీడియా ప్రాధమ్యాలు**

రాజకీయ నాయకుల ప్రాపకంలో తెలివిమీరిన అధికారులు వారి అడుగులకు మడుగులొత్తుతూ అవినీతితో సొమ్ములు స్వాహా చేయడంలో రాటుదేలారని మనందరికీ తెలుసు. సామాన్య ప్రజానీకానికి సంబంధించినంత వరకు తమ బాధలకు ఎవరిని నిందించాలో తెలియదు. కాని వారు చదువు లేదా మరే అర్హత అవసరం లేకుండా రాజకీయ నాయకులుగా చలామణీ అవుతున్న గుంపుని అసహ్యించుకుంటున్నారు. రాజకీయ నాయకులు కూడా తమ జుగుప్సాకర ప్రవర్తనతో ప్రజల ఆగ్రహాన్ని చవి చూస్తున్నారు. పరిస్థితి ఎంతగా దిగజారిందంటే రాజకీయ నాయకుల దుర్భాషలను ప్రజలు పట్టించుకోవడం మానేసారు. తాజాగా కర్ణాటకలో మాజీ ప్రధాని తిట్లపురాణం పరిస్థితికి అద్దం పడుతోంది.

**☞ రాజకీయానిదే మొదటి తప్పు, సరిదిద్దుకోవాల్సిన చివరి బాధ్యత రాజకీయానిదే**

అతి సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన మధుకోడా లాంటి వ్యక్తి రాజకీయాల్లో వేలకోట్ల కుంభకోణానికి పాల్పడిన సంఘటనలు రాజకీయ నాయకుల వాగ్దూషణలకు, కార్పణ్యాల తీవ్రతకు గల కారణాలను విశదీకరిస్తాయి. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ప్రచారంలో, ఓట్లు కొనడంలో, మీడియా న్యూస్ స్పేస్ కొనడంలో పెడుతున్న విశృంఖల ఖర్చు సామాన్యపౌరుడిని నిశ్చేష్టుణ్ణి చేస్తుంది.

డొనేషన్లతో సీటు కొని చదువుకున్న వైద్యవిద్యార్థి తన పెట్టుబడికి వెయ్యింతలు రాబట్టుకోవడానికి రోగులను పీల్చిపిప్పి చేసినట్లుగా ఎన్నికలలో కోట్లు గుమ్మరించిన రాజకీయ నాయకుడు గెలిచిన తరువాత ప్రజాధనాన్ని కొల్లగొడతాడనటానికి రాకెట్ విజ్ఞానం చదవనక్కరలేదు.

**☞ రాజకీయాన్ని పట్టించుకుని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిది, మీడియాది, మనందరిది**

కాస్త అటూ, ఇటుగా అన్ని ప్రభుత్వశాఖలు రాజకీయ నాయకులకు డబ్బు గనులుగా మారాయి. కాకపోతే కొన్ని మరీ ఆకర్షణీయంగా వుండి ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి తమ మంత్రులకు శాఖలు కేటాయించేటప్పుడు పిల్లుల కొట్లాటని తలపిస్తాయి.

మద్రాస్ ఐఐటి మాజీ డైరక్టర్ ప్రొ. ఇందిరేసన్ కనుగొన్నట్లుగా 800 మంది పిల్లలున్నా మూత్రశాల వసతి లేని పాఠశాలలు, డాక్టర్లులేని పిహెచ్‌సిలు మనదేశంలో గ్రామగ్రామాన, ప్రతీపట్టణంలో, అన్ని రాష్ట్రాల్లో వున్నా వాటి గురించి వ్రాసేందుకు మీడియాకు సమయం వుండదు. ఎందుకంటే దేవెగౌడలాంటి రాజకీయ నాయకుల దుర్భాషలు ప్రచురించడంలో, ప్రసారం చేయడంలో అనుక్షణం నిమగ్నం అయివుంటున్నారు కాబట్టి.

**☞ మీడియా పవిత్ర వ్యాసంగం. అది మంచి రాజకీయాన్ని ప్రోత్సహించాలి.**

**- రషీదాభగత్ (ది హిందూ జనవరి 12, 2010 సౌజన్యంతో..)**

## దక్షిణ ఆసియా మీడియా మానిటర్ 2009 సం॥ రిపోర్టు

★ ఈ రిపోర్టు ప్రకారం ఈ సంవత్సరం విపరీతమైన వ్యాపారధోరణులు, ఏకస్వామ్యత, మితిమీరిన రాజకీయ ఒత్తిళ్ళు భారత పాకిస్తాన్‌లలోని మీడియాలో వృత్తివిలువలను దిగజార్చాయి.

★ భారతదేశంలో వార్తాకథనాల్లో లోపిస్తున్న విలువలపై జరుగుతున్న చర్చల్ని ప్రస్తావిస్తూ ప్రింట్ మరియు బ్రాడ్‌కాస్ట్ మీడియాలో, వస్తున్న పెయిడ్‌న్యూస్ - సెల్లింగ్ న్యూస్‌స్పేస్ గురించి ఆందోళన వ్యక్తం చేసింది. ఖండించదగిన ఈ న్యూస్‌స్పేస్ అమ్మకం మీడియా విశ్వసనీయతకు మరియు నిష్పక్షపాత స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య ఎన్నికలకు గొడ్డలిపెట్టులా మారాయి. ప్రపంచ అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో మీడియా ఎక్కువస్వేచ్ఛని, ఆధునికతను సంతరించుకుంది.

★ అలాగే పాకిస్థాన్‌లో మీడియా విలువల్ని గాలికొదిలేసి వృత్తిలోని కొద్దిమంది స్వేచ్ఛని దుర్వినియోగపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని నిందాభరితం చేసి అస్థిరతపాలు చేసారు.

# ఆలోచించండి !

## గాంధీజీకి పనీపాట లేకనా?
## బారిస్టర్ గిరీ చెయ్యలేకనా?





## ఆయన మాత్రం జనం కోసం రాజకీయాలలోకి రావలసిన అవసరం ఏముంది?

మన జీవితాలు మారాలంటే రాజకీయం మారాలి. అందుకు ఎవరో ఒకరు వస్తారని, ఏదో ఒకటి చేస్తారని ఎదురుచూస్తూ కూర్చుంటే మిగిలేది అంధకారమే. ఆ ఒకరు మనమే కావాలి. ఆ మార్పు మనమే తేవాలి.

అందుకే....
జనంచేత, జనంకోసం

**లోక్‌సత్తా పార్టీ**

RNI.Ref. No. Nil-1/10/2009, Verification Date: 27/11/2009

# ఎమ్మెల్యే రాజ్యం

మీకు ఏది కావాలి ? తేల్చుకోండి !

గ్రామాల బాగోగులన్నీ
మేము చూస్తాం!

మీ అవసరాలన్నీ
మాకే తెలుసు!




నిధులు అడగకండి
మేం ఖర్చు చేస్తాం

మీ కోసం పథకాలు వేస్తాం
మేమే అమలు చేస్తాం

## ఎమ్మెల్యేల పెత్తనం పోవాలి
## పంచాయితీల రాజ్యం రావాలి

# జిల్లా ప్రభుత్వాలు

## గ్రామ/పట్టణ ప్రభుత్వాలు

మా గ్రామాల బాగోగులు
మేం చూసుకుంటాం

మా అవసరాలు
మాకే బాగా తెలుసు

## ప్రజలే ప్రభువులు



మా వాటా
మాకు ఇవ్వండి

మా గ్రామ ప్రణాళిక
మేమే రాసుకుంటాం

## పరాయి పాలన అంతం - స్వరాజ్యం
## పరోక్ష పాలన అంతం - గ్రామ సురాజ్యం

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, for and on behalf of Foundation for Democratic Reforms ,
Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 0082, and printed at Kala Jyohti Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad